శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

గురుమహిమ... గురుమహిమ... అపారమహిమ... గురుమహిమ

గురుమహిమ... గురుమహిమ... అనంతమహిమ... గురుమహిమ

గురుమహిమ... గురుమహిమ... అఖండమహిమ... గురుమహిమ

సాయిప్రేమను పంచుతూ - సాయితత్త్వాన్ని పెంచుతూ...

సాయి సుజ్ఞాన సౌరభాలను నిరంతరం వెదజల్లుతున్న

సౌగంధ సౌరభ సౌధం - శ్రీబాబూజీ సాన్నిధ్యం



# కృప

ఆరాధనోత్సవ సంచిక

స్మృతుల సన్నిధిలో అక్షరాల అర్చనలు... ఆరాధనలు..



# ఆనంద జీవనం - సాయిపథం

సాయిపథం అని అంటే Way of understanding ప్రపంచం పట్ల, మీపట్ల, మీ చుట్టూ ఉన్న వాళ్ళ పట్ల మీ దృక్పథంలో వచ్చేటువంటి మార్పు. ఎంత చక్కగా ఉన్నాం మనం? ఎంత నిశ్చింతగా ఉన్నాం? ఎంత హ్యాపీగా ఉన్నాం? ఒక sense of securityలో, ఆనందంగా మనకుండేటువంటి హ్యాపీనెస్‌ని పదిమందికి పంచుతూ ఆ పంచడంలో మనం ఇంకా హ్యాపీనెస్‌ని పొందుతూ అలా ఉండగలిగితే చాలు. అదే సాయిపథం అని అంటే. సాయి అంటే ఆనందం, నన్ను ఆనందస్వరూపునిగా ధ్యానించు అని అన్నాడాయన. సాయి అంటే ఆనందం, పథం అంటే మార్గం. It's path of Happiness. మనం ఎప్పుడూ ఆనందంగా ఉండటం, సాయిపథంలో ఉన్నట్లు లెక్క. హ్యాపీగా ఉండండి. దుఃఖం వస్తూ ఉంటూంది. Disturb అవుతూ ఉంటుంది. ఎందుకు Disturb అవుతున్నాం మనం. ఇది నిజంగా సమంజసమేనా? నిజంగా అవసరం ఉందా? నిజంగా అంత కష్టం వచ్చిందా నాకు? అని ఆలోచించుకోండి. వెళ్లిపోతుంది. మళ్ళీ వస్తుంది. మళ్ళీ ఆలోచించుకోండి. పోతుంది. ఈ విచక్షణ కావాలి. ఆ థింకింగ్ కావాలి. ఆ వివేకం కావాలి. అది నిజమైన సత్సంగం అంటే.



అనుగ్రహానికి మనమంతా అర్హులమే.

ఆనందం మన జన్మ హక్కు. బాబా అనే ఆనందాన్ని అనుభవిద్దాం.... ఆస్వాదిద్దాం... అంతా వ్యాపింపచేద్దాం.

బాబా మీకిచ్చిన అందమైన జీవితాన్ని అర్థం చేసుకొని ఆనందంగా ఉండటానికి ప్రయత్నించండి.



అనుక్షణం ప్రతి శ్వాసలో ఆనందాన్ని ఆస్వాదిద్దాం. జీవితం మనకొక వరం. అది ఒక శాపం, దౌర్భాగ్యం కాదు. అది ప్రకృతి ప్రసాదించిన ఒక వరం. దాన్ని మనం ఆస్వాదిద్దాం. నీ యదార్థమైన ఆనందానుభూతి నీవు అనుభవించే వస్తువుపై ఆధారపడి లేదు.

*Contd. Page 31*

సంపుటి : 17
నవంబర్ 13



# కృప

సంచిక : 5
2014



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ



లోపలి పేజీలలో

అపార కరుణామయుని 'అభయం' - ఉందా మనలో 'భయం' 4
– గురుకృప

పురోగతి 8
– శరశ్చంద్రికలు

అసహాయత - అనుగ్రహం 16
– శరశ్చంద్రికలు

మనిషి విలువ ఎంత? 25
– గురుకృప

అందరూ బాగుండాలి 26
– గురుకృప

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు**

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.

## అపార కరుణామయుని 'అభయం' - ఉందా మనలో 'భయం'

**ఏలికే మీరన్న ఎరుక మాకెప్పుడు, అనుసరణతోపాటు ఆచరణ ఎప్పుడు,**
**మీ చెంత మాకింక చింత లేదెప్పుడు! ఉందిగా మీ అభయమే అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ!**

మానవ జీవితం ఎంతో విచిత్రమైనది. ప్రపంచంలో ఎన్నో కోట్ల జీవరాశులున్నా ఒకే ఒక్క జీవికి 'బుద్ధి'ని ప్రసాదించాడు భగవంతుడు. మార్మికమైన అవగాహన లేదు కనుక గ్రంధానుగత అనుభవంతో చెప్పగలిగింది ఏమంటే మానవజన్మ ఎంతో ఉత్కృష్టమైనదని చెబుతారు పెద్దలు. అంతటి గొప్పదైన జీవితాన్ని మనం గడిపే తీరు ఎంత గొప్పగా ఉండాలో, ఏ మార్గంలో పయనించి మన జీవితాలు పండాలో తెలియాలంటే సంతుల పథమెరగాలి, వారి జీవితమనే పవిత్రగంగలో మునగాలి. నిష్కర్షగా ఆలోచిద్దాం! ఇలాంటి ఒక పునరావలోకనం అవసరమా అని? ఎలా ఉంది మన జీవితం? కేవలం 'బాల్యం' – ఇదొక్కటే ఏ 'మూల్యం' చెల్లించాల్సిన అవసరం లేని ఆనందజీవనం. గడిచిందా ఇక మొదలు విద్యలో రాణిస్తామా? ఉద్యోగం లభిస్తుందా? స్థిరమవుతుందా? వివాహం మాటేమిటి? కోరుకున్న వరుడు / వధువు లభిస్తారా? పదోన్నతి మాటేంటి? బిడ్డలు? వాళ్ళ ఆరోగ్యాలు, శ్రేయస్సు? ఇల్లు, డబ్బు, కార్లు, బంగళాలు, బంగారాలు? ఎప్పుడూ ఒక ప్రశ్న. ఇలా ప్రతీచోటా ఏదో ఒక వెలితి, భయం, ఏమిటి తర్వాత? ఇక్కడ ఆగుతుందని చెప్పండి. ఒక్కసారి గుండెమీద చేయి ఉంచుకొని ఇదిగో ఈ క్షణాన నేను సంతోషంగా ఉన్నాను. ఇలా నా జీవితాంతం ఉంటాను. ఇందులో సందేహం లేదని ఒక్క మనిషి చెప్పగలుగుతున్నాడా? ఎక్కడుంది లోపం? మహాత్ముల చరిత్రలనధ్యయనం చేస్తే అర్థమయ్యేది – తమ 'ఉనికికి' (Very exissence of the 'being') మూలాన్ని తెలుసుకోవడంలో వారు ఎటువంటి అలసత్వానికి తావివ్వలేదు. ఆ మూలాన్ని తెలుసుకున్నాక ఆమూలాగ్రం (పూర్తిగా) దానితో తాదాత్మ్యం చెందారు. అంకితమయ్యారు.

మనిషి – మహాత్ముడు ఎప్పుడయ్యాడా అని ఆలోచిస్తే తన 'మూలాన్ని' తెలుసుకోవడంలో రాజీ పడలేదు. అందుకు ఎలాంటి కష్టాన్నైనా భరించాడు. క్షమించాలి... సంతోషంగా స్వీకరించాడు. ఎంతటి సుదూర ప్రయాణాన్నైనా ఆస్వాదించాడు. గమ్యం చేరాక తెలిసింది తన ఉనికికి కారణం దైవమని, అతడు అపార దయాహృదయుడని, కేవలం ఈ జగత్తంతా అతనికి స్వప్నం మాత్రమేనని, మరుక్షణం




**సాధనా మార్గాలు :** శ్రీసాయిపట్ల మనకున్న ప్రేమ వ్యక్తం చేసుకోవడానికి సాయి మనపట్ల చూపించే ప్రేమానుగ్రహాన్ని ప్రసాదించిన ఆనందాన్ని చవిచూడటానికి, అనుభవించడానికి గురుదేవులు సూచించిన ప్రధానమైన సాధనా మార్గాలు సత్సంగం, నామస్మరణ (భజన), పారాయణ.

నుంచి తానైన 'గుర్తింపు'కై తనకు చింత లేదు. 'తన ఆజ్ఞ లేక ఆకైనా కదలదన్న' సత్యం అనుభవైకవేద్య మయ్యాక ఇక 'భయా'నికి తావెక్కడిది? 'అభయ' స్వరూపుడే తనవాడయ్యాక, 'ఆదుర్దా'కు అర్థమేముంది? మనందరికి రావాల్సింది ఆ 'ఎరుక'. తెలియకపోతే బ్రతుకంతా తికమక.

***జేబులో సాయి - గుండెలో ఉన్నాడు 'ఇహపర శ్రేయోదాయి'***

పాతతరంలో, పెద్దవాళ్లలో గమనిస్తూ ఉంటాం శ్రీసాయిబాబానో, మరో దేవీ దేవతల చిత్రాన్ని ప్రేమపూర్వకంగా, గుర్తొచ్చే విధంగానూ జేబుల్లో పెట్టుకోవడం - ఇప్పుడు కొత్త తరంలో ఆ స్థానాన్ని మొబైల్ భర్తీ చేయడం జరిగిందనుకోండి. దైవం యొక్క 'స్థితి' మారిందే కానీ మనిషి 'మతి' (ఆలోచన) మాత్రం మారలేదు. నిజానికి తన హృదయ మందిరంలో కొలువైన ఆ సూత్రధారిని దర్శించే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. చింతల (కష్టాల) చుట్టూనే తన ఆలోచనంతా! పరిణామ క్రమంలో తన బిడ్డలను ఉద్ధరించాలనే ఆ సద్గురుమాయి తపనంతా! దైవాన్ని 'జేబు'కే పరిమితం చేస్తే మిగిలేదేముంది? గురుదేవులన్నట్లు మనం సాయిభక్తులమని ప్రపంచం మొత్తానికి తెలుసు. ఒక్క శ్రీసాయికి తప్ప. పిలిస్తే పలుకుతాను, తలస్తే దర్శనమిస్తానన్న శ్రీసాయి వాక్కే మనకు శృతివాక్యం. తరచి చూసుకుందాం, ప్రతీ గురుబంధువు జీవితంలో, అలాంటి ఎన్ని దర్శనాలున్నాయో! అవసరాలన్నీ తీరాయా?లేదా? ఆయన చెంత. కోర్కెలను తీర్చడమే కాదు, కోర్కెలను తీర్చి 'దిద్దిన' విధానం గమనిస్తే మన జేబులో ఉన్న పరిమితమైన సాయి కాదు, గుండెలో ఉన్న సద్గురు సత్స్వరూపం దర్శనమిస్తుంది.

***జగమే తన ఆధీనమైతే ... బ్రతుకే ఒక ప్రసాదమైతే!***

"వేసవిలో ఒకనాడు ఎండ భరించలేక భక్తులంతా ఇళ్లకు వెళ్లారు. అయిదుగురు మాత్రం మసీదులో ఉండిపోయారు. సాయి వారిని ధుని దగ్గర కూర్చోమన్నారు. కొద్దినిమిషాలలో మసీదంతా చల్లబడింది. భక్తులంతా ఆశ్చర్యపోయారు. "భీమా అనేవాడు సాయిలీలలు చూడాలని వచ్చాడు. మధ్యాహ్న ఆరతి కాగానే సాయి, "నేను పిలిచేవరకు మీ గదులలోనే ఉండండి" అని అందర్నీ పంపేసారు. వారు గదులు చేరగానే చేరగానే సుమారు 15 ని॥లపాటు ఇళ్లకప్పులెగిరిపోయేలా పెనుగాలి వీచింది. మబ్బుపట్టి కొద్దివర్షం కూడా కురిసింది. తరువాత భక్తులను పిలిపించి, "భయపడ్డారా" అన్నారు బాబా. భీమా ఆయన పాదాలకు నమస్కరించగానే "భగవంతుని లీల చూసావా? ఇలా ఎన్నైనా చూడగలవు" అన్నారు.

**సత్సంగం :** నిరంతరం మనలను సాయిస్మరణలో ఉంచి, సాయి సాన్నిధ్యాన్ని, ప్రేమను అనుభవింపచేసేది సత్సంగం. గురుదేవులు నియమం తప్పకుండా సత్సంగం చేసుకునేవారు. క్రమం తప్పకుండా సత్సంగానికి వెళ్లమని అందరికీ సూచించేవారు శ్రీబాబూజీ. బాబా స్మరణలో ఉంటూ, బాబాకు మనల్ని మనం దగ్గర చేసుకునేటువంటి ప్రయత్నం అనే విషయం గుర్తుపెట్టుకోవాలి.



సత్సంగ సంభాషణలో సిమ్లా గురించి రాగానే, మాలోనుంచి చిన్నగా ఎవరో "ఇంతదూరం వచ్చినందుకు ఇప్పుడిక్కడ మంచు ఉండి ఉంటే ఎంత బాగుండేదో కదా"! అన్నారు. "ఎందుకంత నిరాశ? బాబా తలచుకుంటే మంచు ఎంతసేపట్లో కురవాలి?" అన్నారు గురువుగారు చిన్నగా నవ్వుతూ. సుమారు నాలుగు గంటలప్పుడు అంతవరకు లేనిది చిరుజల్లులతో వర్షం మొదలైంది. అది మెల్లగా మంచుతుంపర్లుగా మారి రాత్రంతా మంచు కురుస్తూనే ఉంది.

ఒకరోజు మధుర్, గురుదేవులతో ఇలా అన్నాడు. "భగవంతుడు సైతం తన శాసనాలను ఉల్లఘించలేడు. ఒక శాసనం అమలు పరచిన తరువాత ఆయన కూడా ఆ శాసనాన్ని అతిక్రమించలేడు". రామకృష్ణులన్నారు ***"ఏమంటున్నావు? ఆయన తలచుకుంటే తాను అమలుపరచిన శాసనాన్ని రద్దు చేయగలడు లేదా అందుకు బదులుగా మరొక శాసనాన్ని అమలు చేయగలడు"*** మధుర్ ఈ అభిప్రాయాన్ని వ్యతిరేకించి "ఎర్రపూవులు పూచే చెట్టు ఎర్రపువ్వులను మాత్రమే పూస్తుందని, ఎన్నటికీ తెల్లపూవులు పూయదని భగవంతుడు శాసనం చేసాడు. ఎర్రపూవులు పూచే చెట్టుకు ఒక్క తెల్ల పువ్వును పూయించ మనండి చూద్దాం" అన్నాడు మధుర్. "అవును, ఆయన ఏదన్నా చేయగలడు – ఇది కూడా" అన్నారు దృఢంగా శ్రీరామకృష్ణులు.

మర్నాడు దేవదారు వనానికి పోతున్నప్పుడు ఒక ఎర్రమందార చెట్టు ఒకే కొమ్మకు ఒక ఎర్రనిపువ్వు, మిరుమిట్లు గొల్పే ఒక తెల్లని పువ్వు పూచి ఉండటం శ్రీరామకృష్ణులు చూశారు. వెంటనే ఆయన ఆ కొమ్మను విరిచి మధుర్ వద్దకు తీసుకువెళ్లారు. ఆదిచూసి మధుర్ విస్తుబోయి, "అవును బాబా! నేను ఓడిపోయాను" అన్నాడు. కాలగతిలో ఎందరో మహాత్ములు తమతమ బిడ్డల కోసం చేసిన లీలా వినోదాల పరంపర చూసాం. ***నిజానికి ప్రేమ పరవశులై తమ బిడ్డల శ్రేయస్సుకై తపిస్తున్న ఆ సద్గురుమూర్తుల ప్రతీ చర్యలోనూ తాను భాగమవుతూ ప్రకృతి అర్పించిన ప్రణతులవి! గమనిస్తే అసాధ్యమన్నది ఉన్నదా ఆ ఆనందస్వరూపుని చెంత! ఇక మనకెందుకు చింత!***

***చింతలు దూరమవ్వాలా? కట్టు అనుభవ 'సుమాల' మాల***

"ప్రేమించిన వాడు మౌని అయ్యాడు, ప్రేమిస్తున్నాననుకున్నవాడు కవి అయ్యాడు." ఎక్కడా లోటు లేదు. తనకు తెలిసింది ఉద్ధరణే, ఉద్ధరణ మాత్రమే! "నాకు అన్నీ ఆయనే చేసారండీ! ఈ రోజు నేను తింటున్న ప్రతీ మెతుకు ఆయన ప్రసాదమే!" అన్నాడు శీనయ్య! గంట గడిచిందో లేదో కబురొచ్చింది




**సత్సంగం :** బాబా ప్రచారానికి కాదు. ఎవరినీ ఉద్ధరించడానికి కాదు. దీని ద్వారా ఇంకేదో సాధించాలని కాదు. బాబా యొక్క స్మరణలో ఉండటానికి, బాబాను గుర్తుపెట్టుకోవడానికి, బాబాపట్ల మన ప్రేమను పెంచుకోవడానికి, బాబాకు మరింత దగ్గర కావడానికి ఒక సాధనం. సత్సంగం మనం సరిగ్గా చేస్తున్నామా లేదా అనేది బయట మనం చేసేటువంటి పనులు చెప్తుంటాయి.

తన బిడ్డకు సుస్తీ చేసింది అని. మరుక్షణమయ్యాడు కన్నీళ్ళ వానయ్య! అన్నీ మరిచిపోయాడు. అసాధ్యమనుకున్న ఎన్నో విషయాలను తన జీవితంలో సుసాధ్యం చేసింది సద్గురు అనుగ్రహమన్నది మరిచాడు. భక్తి యొక్క పరిణితి తెలిసేది – జీవిత గమనంలో ఎదురయ్యే సంఘటనల పట్ల మన దృక్పథంలోనే!! గురుచరణాశ్రయుడయ్యాక జరిగిన ప్రతీక్షణాన్నీ ఒక్కసారి అవలోకించుకుంటే అవగత మవుతుంది, కంటికిరెప్పలా తనను, తన కుటుంబాన్ని, సర్వులను ఆ సద్గురుచంద్రుడు ఎలా కాపాడాడో!

***అక్షర రూపంలోనికి తెస్తే అవగతమవుతుంది ఆ అపార కరుణాధరుని సురచనా సారస్వతము. బిడ్డలందరి జీవితాన్ని పీఠికతో ప్రారంభించి మంగళాశాసనమ్‌తో, కేవలం మంగళకరంగానే తీర్చిదిద్దడానికి దీక్ష వహించిన ఆ మహితాత్మునికి వేయాల్సింది మన అనుభవ సుమాల మాల... చింతలు దూరమయ్యి మన బ్రతుకంతా ఆనంద హేల...***

***బిడ్డ అడిగేది 'బ్లేడు'... అరచి గీపెట్టినా ఇవ్వడు చూడు...***

మూడు సంవత్సరాల బిడ్డ తండ్రి గడ్డం చేసుకోవడం చూసి మారాం చేస్తాడు బ్లేడు కావాలని. నాన్నా! నేను కూడా నీలాగా చేసుకుంటానని. ఇస్తాడా తండ్రి! బ్రతిమాలతాడు, సర్దిచెపుతాడు, ధ్యాస మరల్చయత్నిస్తాడు... ఇలా ఎన్నో. మనమూ అంతే, ఆ ప్రేమ స్వరూపుని చెంత. కొన్ని ఎందుకు అందవో తెలియదు. కాలం గడిచేకొద్దీ తెలుస్తుంది ముళ్ళను కౌగిలించుకోబోయామని. అప్పుడు ఊరూవాడా ఏకమయ్యేలా చెప్పాలని యత్నిస్తాడు తన తండ్రి కరుణ ఎంత గొప్పదో! ***మన బిరుదులు ఆశించి బాధ్యత తీసుకున్నాడా? లేదు, తప్పటడుగులు సరిదిద్దు 'తండ్రి'యై... శరీరమే పంచిన 'తల్లి'యై.. తనంతటి వాడవ్వాలన్న ప్రేమతో 'దైవమై' అనుగ్రహిస్తాడు. ఆనంద స్వరూపుడై, ఆరాధ్యుడై ఆశీర్వదిస్తాడు, అభయమిస్తాడు.***

చివరగా ఒక్కమాట. శ్రీసాయిస్వరూపం – ఆనందస్వరూపం, అభయరూపం. సదా సద్గురుచంద్రుని కనుసన్నల్లో మనము ఉన్నామన్న ఎరుకే మనలో చింతను పోగొట్టి నిశ్చింతను ప్రసాదిస్తుంది. అట్టి నిశ్చింతే మన జీవితంలో సత్కర్మాచరణకు దారితీస్తుంది. ఆ సత్కర్మాచరణే సద్గురువుకు మనం చేసే నిజమైన ఆరాధన. సత్స్వరూపుడైన ఆ సచ్చిదానందుని చెంతన ఉన్నది ఆనందం. ఆనందం మాత్రమే! ఆయన 'అభయం' మనకు తోడు... ఆయన సదా మనతో ఉన్నారన్న 'ఎరుక'తోనే మనం 'భయం' వీడు.

***– 'గురుకృప'***

**సత్సంగం :** సత్సంగం సరిగా చేస్తే మనలో మార్పు రావాలి. మన ఆలోచనా విధానంలో, మన ప్రవర్తనలో, మన ఆచరణలో మార్పు రావాలి. ఆ మార్పులు రాకుండా అయితే మాత్రం, సరైన పద్ధతిలో సత్సంగం చేయడం లేదనే అర్థం. మనలో పరివర్తన లేనటువంటి సత్సంగాలు అవసరం లేదు.



**కృప**

# పురోగతి *అక్టోబర్ 2014*



**భక్తుడు** : గురువుగారూ! ఆధ్యాత్మికంగా మేము పురోగతి సాధిస్తున్నామో లేదో తెలుసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుందా? లేదా దాని గురించి మేము పట్టించుకోవలసిన అవసరం లేదా?

**గురువుగారు :** మీరు పురోగతి సాధిస్తున్నారో లేదో తెలుసుకొనే సామర్థ్యం మీకుంటే తెలుసుకోండి.

**భక్తుడు** : మనం పురోగతి సాధిస్తున్నామనేటందుకు గుర్తేమిటి?

**గురువుగారు :** అది మీకే తెలియాలి (గురువుగారు నవ్వుతూ...) నేను ముందు చెప్పినట్లు, ఎన్నిసార్లు "నేను, నాకు" అని అనకుండా ఉంటున్నారనేదే నిజమైన పురోభివృద్ధి – "నాకు ఇది కావాలి, నాకది ఇష్టం, నాకది నచ్చదు" – ఇలాంటి 'నేను, నాకు' అనే వ్యవహారమంతా ఏమీ లేకపోవడం, మీరు అంతరంగంలోనూ బాహ్యంలోనూ ఎంత సామరస్యంగా ఉన్నారు. ఎంత సంతృప్తితో ఉన్నారు, ఎంత ఆనందంగా ఉన్నారు. మీకు మాటల్లో చెప్పలేనటువంటి భద్రతాభావం ఉందా... ఇలాంటివన్నీ మన పురోభివృద్ధికి చిహ్నాలు.

మీ వ్యక్తిత్వం ఎంతగా పరివర్తన చెందింది, మిమ్మల్ని గురించి మీరు ఏమనుకుంటున్నారు, ఈ ప్రపంచాన్ని ఎలా చూస్తున్నారు అనేదే నిజమైన పురోగతికి గుర్తు; మీ తోటివారిని ఎలా చూస్తున్నారు, వారితో ఎలా మెలగుతున్నారు, వాళ్ళు మిమ్మల్ని ఎలా చూస్తున్నారు – ఇవీ ప్రధానమైనవి. అంతేకానీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తే అనుభవాలు కాదు. బాబా వీటినే 'చమత్కారాలు' అన్నారు. చమక్ అంటే మిరుమిట్లు గొలపడం. సాధారణంగా వీటినే అందరూ 'అద్భుతాలు' అంటారు. దీనికే మిరుమిట్లుగొలపడం అని కూడా అర్థముంది. అంటే అవి మీ కళ్ళు చెదిరేలా చేయడమో, మిరుమిట్లు గొలిపి కనిపించకుండా చెయ్యడమో చేస్తాయి. సాధారణంగా వెక్కివెక్కి ఏడవడము, పెద్ద వెలుగును




**నామస్మరణ :** "నన్నందరూ సాయిబాబా అంటారు" అన్న శ్రీసాయి మాటే శృతి ప్రమాణంగా శ్రీబాబాజీ ప్రపంచానికి ప్రసాదించిన దివ్య సాధనం "సాయిబాబా-సాయిబాబా" అనే నామస్మరణ. నామస్మరణ అంటే కేవలం నోటితో ఉచ్చరించేది కాదు. నామం పలుకుతున్నామంటే బాబాని పిలుస్తున్నామని అర్థం. బాబా బాబా అని నీ గుండె లోతుల నుండి పిలువు.

చూడటం, చిత్రమైన శబ్దాలను వినడం, మూర్ఛపోవడం, పిచ్చిపట్టినట్లు ప్రవర్తించడం – ఇటువంటి వాటిని ఆధ్యాత్మిక అనుభవాలని అనుకొంటారు. ఒక పెద్ద వెలుతురు కనిపించడం వలన కలిగే ప్రయోజనం ఏమిటి? అటువంటి అనుభవాలు కలిగిన తరువాత మన హృదయంలో పరివర్తన కలిగిందా? లేక మన వ్యక్తిత్వంలోగాని, మన దృక్పథంలోగాని, మన భయాలు, వ్యామోహాలలోగాని, ఇష్టాయిష్టాలలోగాని ఏమన్నా మార్పు వచ్చిందా అని చూడాలి.అలా కాకపోతే ఇటువంటి మానసిక స్థితులు, మనోభ్రాంతులు ఆధ్యాత్మిక అనుభవాల పేరు మీద చలామణి అయిపోతాయి. వీటి వలన ప్రయోజనం ఉండదు. ఇక్కడ అటువంటి వాటికి స్థానం లేదు. ఒకవేళ మీకు అటువంటి అనుభవాలు ఏమైనా వచ్చినపుడు వీటితో పాటు మాటలకందని పరివర్తన కూడా రావాలి.

ఇక్కడ బాబా దగ్గర జరిగేది ఏమిటంటే, మీరు వదలిపెట్టలేని క్లిష్టమైన బలహీనతలు రాత్రికి రాత్రి మాయమైపోతాయి. మీ మనస్సుమీద నుండి భారం తగ్గిపోయినట్లుగా ఉంటుంది. రాత్రిపూట మీకు ఒక కలలాగానో, అనుభవంలాగానో వస్తుంది. తెల్లరేసరికి మీరు క్రొత్త వ్యక్తిగా మారిపోయినట్లు అనిపిస్తుంది. మీరు చేసింది ఏముంది? ఏమీలేదు! కొంతమందికి అటువంటి అనుభవాలు రాత్రికి రాత్రి జరగవచ్చు. మరికొందరి విషయంలో అది జుట్టు నెరసినట్లు మెల్లగా జరగవచ్చు. అదో ప్రక్రియ, వయస్సు మళ్ళడం ఎలా తప్పదో అదీ అలాగే జరిగి తీరుతుంది.

**భక్తుడు** : గురువుగారూ! ఒక వ్యక్తిలో మార్పు రావచ్చు కానీ అతను తిరిగి తన పాత వ్యక్తిత్వంలోకి తిరిగి వెళ్తున్నట్లు కనిపిస్తుంది.

**గురువుగారు :** అలా కనిపించవచ్చు, కానీ అది నిజం కాదు. ఒక వ్యక్తి నిజంగా తిరిగి పాత వ్యక్తిగా మారలేడు. అది మీరంటున్న ఆధ్యాత్మిక జీవితంలోనే కాదు, సాధారణ జీవితంలో కూడా ఎక్కడా ఒక వ్యక్తి తిరిగి పాతవ్యక్తిగా మారడమన్న ప్రశ్నే లేదు.

**భక్తుడు** : ప్రతి ఒక్కరూ మారుతూ ఉంటే తేడా ఏమిటి?

**గురువుగారు :** ఆ మార్పు మన పరిపూర్ణత్వం కోసం జరగాలి. మనకు విభిన్న మార్గాలలో, విభిన్న రకాలుగా, విభిన్నమైన తీవ్రతలతో నిరాశానిస్పృహలు అనుభవమవుతూనే ఉంటాయి. అలా జరిగే మార్పు మనకు పరిపూర్ణత్వాన్ని సమకూర్చేదిగానూ మనలోని ఈ నిస్పృహను తొలగించేదిగానూ

**నామస్మరణ :** నామం చేసేటప్పుడు నెంబర్ ముఖ్యం కాదు. ఎన్నిసార్లు అనేది లెక్కకాదు. మీ హృదయాలలో ఉన్న బాబాను పిలవండి. "బాబా! బాబా!" అన్న ప్రతిసారీ మీ ప్రేమ, మీ ఎమోషన్, మీ ఆర్తి, మీ ఆవేదన, మీ ఆనందం అన్నీ దానిలో వ్యక్తం అవ్వాలి. పిలిచిన ప్రతిసారీ హృదయాంతరాళలోనుంచి బాబా వింటున్నారు, మనం పిలుస్తున్నాం అనే భావనతో చేయాలి. మనం పిలిచిన ప్రతిసారీ బాబా వింటూనే ఉంటారు. అప్పుడు శ్రద్ధ ఎక్కడికీ పోదు. అది రొటీన్ కాదు.



ఉండాలంటున్నాను. దానినే మనం మార్పు అంటాము.

**భక్తుడు** : మన వ్యక్తిత్వ మూలాలు కూడా మారతాయా?

**గురువుగారు :** కేవలం మూలాలే కాదు, ప్రతి ఒక్కటీ మారుతుంది.

**భక్తుడు** : గురువుగారూ! మన భావోద్వేగాలు కూడా మారుతాయా లేకపోతే అవి అలానే ఉంటాయా?

**గురువుగారు :** మనం మారితే మన భావోద్వేగాలు మారడం కాదు, భావోద్వేగాలలో కలిగే మార్పునే మనం 'పరివర్తన' అని అంటాం. నేను పరివర్తన గురించి మాట్లాడినపుడు నేను చూసేది మీలోని భావోద్వేగాలలో కలిగే మార్పు.

**భక్తుడు** : గురువుగారూ! మనం విషయాలను అర్థం చేసుకునే మౌలికమైన పద్ధతిని మార్చుకోవడం చాలా కష్టమని మీరు చెప్పారు. మౌలికమైన ఆ పద్ధతి ఏమిటి?

**గురువుగారు :** ప్రతి ఒక్కరికీ కొన్ని మౌలికమైన భావోద్వేగాలు ఉంటాయి. వాటిని వ్యక్తం చేయడానికి వారికి ఒక ప్రత్యేకమైన సంస్కారం (ప్రకృతి) ఉంటుంది. అది ఒక బలమైన అలవాటు (వాసన). కొంతవరకు భావోద్వేగాలను వ్యక్తం చేసేటటువంటి పద్ధతిని మార్చుకోవడం సులువు. కానీ ఆ భావోద్వేగాలను మార్చుకోవడం కష్టం.

**భక్తుడు** : మన ఎరుకలో లేకుండా ప్రతిదీ అలవాటనే రంగు పులుముకున్న తరువాత మనం చెయ్యగలిగినది ఏమైనా ఉందా?

**గురువుగారు :** మీకై మీరు దానిని మార్చుకోవడం సాధ్యం కాదు. అది మీరు కూర్చున్న కొమ్మను మీరే నరుక్కోవడంలా ఉంటుంది – మీరు ఆ పని చెయ్యలేరు. కాబట్టి మీకు వేరే ఆధారం కావాలి – ఇక్కడ సద్గురువు పాత్ర అవసరమవుతుంది. ఆయన సహకారంతో మీరు కూర్చుని వున్న ఆధారాన్ని మీరు వదులుకోగలుగుతారు. మీ ఎరుకలో లేకుండానే మీరు మారుతారు. ఆయన మనల్ని ఎలా మారుస్తారో అది మనకు తెలియదు. అది మనకు సంబంధించిన విషయం కాదు కూడా. కానీ మనం మారామని మాత్రం చెప్పగలుగుతాము. ఇదీ నిజమైన పరివర్తన.

**భక్తుడు** : మనలోని మౌలికమైన భావోద్వేగాలు ఎప్పటికైనా మారుతాయా?

**గురువుగారు :** మౌలికమైన భావోద్వేగాలే మారాలి. మన అలవాట్లు మార్చుకోవడం వలన ప్రయోజనం




**పారాయణ :** మనకు ప్రియమైన బాబా గురించి, బాబా తత్త్వం గురించి తెలుసుకునేందుకు ఒకానొక సాధనం పారాయణ. పారాయణ ఒక మ్రొక్కుబడి తంతుగా చేయరాదు. బాబాలో వ్యక్తం అయ్యే తత్త్వం ఏమిటి? బాబా ఏం చెప్పారు? ఒక లీల జరిగినపుడు ఆ భక్తుని స్థానంలో నేనుంటే ఎలా ఫీలవుతారు? ఇలా ప్రతి విషయాన్ని తరచి తర్కించుకుంటూ చదవాలి.

లేదు. కానీ మన అలవాట్లు మార్చుకోవడం వల్ల మనలో అలజడిని, వ్యతిరేకమైన భావాలు పెంపొందడానికి కారణమైన బీజాలనూ అదుపులో పెట్టుకోవచ్చు. ఒకవేళ మీరు చెయ్యగలిగింది ఏమన్నా ఉంటే అది అంతవరకే. మీరు ఇంతవరకు ప్రయత్నించవచ్చు.

**భక్తుడు :** మనలోని మౌలికమైన భావోద్వేగం ఒకటి మారినపుడు అది దేనిగా మారుతుంది (రూపాంతరం చెందుతుంది)?

**గురువుగారు :** మీకు (పరిపూర్ణమైన) ఆనందాన్ని ఇచ్చే మరో భావోద్వేగంగా మారుతుంది. ఆ భావోద్వేగాన్ని పూర్తిగా తొలగించడం జరగదు. అది పరివర్తన చెందుతుంది. అలా పరివర్తన చెందుతున్న వ్యక్తికి ఆ తేడా తెలియకపోవచ్చు. కానీ బయటవ్యక్తికి ఆ విషయం తెలుస్తుంది. బయటవాళ్ళు, "నీలో చాలా మార్పు కనిపిస్తోంది. నాకు రెండు సంవత్సరాల ముందు తెలిసిన పాతవ్యక్తివి కాదు" అంటారు. కానీ పరివర్తన చెందుతున్న వ్యక్తికి ఆ విషయం తెలియదు. అతను మాత్రం అంతకు ముందర ఉన్నట్లే ఉన్నాననుకొంటాడు. కానీ అతనిలో పరివర్తన ఉంది.

**భక్తుడు :** సద్గురుసన్నిధిలో ఉండటం, సద్గురువును సేవించుకోవడం మొదలైన వాటివల్ల మనలోని పరివర్తన త్వరితగతిన జరుగుతుందా?

**గురువుగారు :** చాలామంది విషయంలో వారు సద్గురువును కలుసుకున్నప్పుడు వారిలో ప్రేమ అనే భావోద్వేగం కలుగుతుంది. – అది సద్గురువు పట్ల. వారి పరిపూర్ణత్వం పట్ల ప్రేమ. ఈ రెండూ ఒక్కటే కానీ ఒక్కొక్కరి వ్యక్తీకరణ ఒక్కొక్కవిధంగా ఉంటుంది. కానీ వాళ్ళు ఎంతో కాలం నుండి ప్రోగు చేసుకున్న అలవాట్ల కారణంగా సద్గురువుతో గల అనుబంధానికి వెనుకగల కీలకాన్ని అర్థం చేసుకోవడంలో అడ్డంకులు సృష్టించుకుంటారు. వారికున్న అలవాట్లు, వ్యక్తీకరించే పద్ధతులు వారిలోనూ, వారి చుట్టూ ఉన్న వాతావరణంలోనూ అలజడి సృష్టిస్తాయి. దానివల్ల వారు ఆనందంగా ఉండలేరు. అన్నీ పొందుతున్నప్పటికీ, ఏమీ నష్టపోనప్పటికీ, ఏమీ కోల్పోకపోయినప్పటికీ – ఆ అలవాట్లు మాత్రం అలానే ఉంటాయి. వాటిని మార్చుకోవచ్చు.

ఒక గంట క్రితం అమ్మగారు (గురువుగారి సతీమణి శ్రీమతి సాయినాథుని అనసూయమ్మగారు) ముందు రోజు వచ్చిన కొంతమంది పిల్లల గురించి నాతో మాట్లాడుతున్నప్పుడు నేను ఇదే విషయం

**పారాయణ :** బాబా లీలను చదివినప్పుడు ఆ సందర్భంలో అక్కడున్న భక్తులలో ఒకడివై ఆ సన్నివేశాన్ని చూడగలగాలి. ఆ లీలా విలాసంలో మైమరచి, ఆనందిస్తూ, మమేకమవగలగాలి. అలా పరాయణత్వం కలిగించినప్పడే అది పారాయణ.



చెప్పాను. ఈ మధ్యనే వాళ్ళు ఒక మంచి ఇంటిలోకి మారారు. ఆ ఇల్లు అందరికీ నచ్చింది. కానీ ఇల్లు ఎలా ఉందని నేను అడిగినపుడు, వెంటనే వాళ్ళు "మాకు బోరు కొడుతోంది. మాకు ఇక్కడ ఎవ్వరూ స్నేహితులు లేరు" అన్నారు. ఇవీ వాళ్ళ ఆలోచనాధోరణులు. వాళ్ళు ఆ ఇంటికి వచ్చి ఒక్క వారమే అయింది. అప్పుడే స్నేహితులు ఎక్కడ నుండి వస్తారు? ఆ కొత్త ఇంట్లో ఉన్న మంచి విషయాలేవీ వారికి కనిపించడం లేదు. వారికెప్పుడూ నచ్చని విషయాలనే చూడడం, వాటి గురించే మాట్లాడడం అనే అలవాటు ఉంది. ఇదో అలవాటు వాళ్ళు ఏమి చెప్పినా, చిన్న విషయమైనా సరే దానిని ఒక ఫిర్యాదుగానే చెప్తారు. దీనిని మార్చుకోవచ్చు. "ఇలా మాట్లాడకూడదు, మంచిగా, సానుకూలంగా (పాజిటివ్‌గా) చెప్పాలి. దీనిని ఇలా వ్యక్తం చేయాలి" అని వాళ్ళకి మళ్ళీ మళ్ళీ చెప్పాలి. అలా చెయ్యకపోతే ఇది బలమైన అలవాటుగా మారి ఎప్పుడూ విషయాలను వ్యతిరేక భావనలతోనే చూస్తూ ఏవో ఫిర్యాదులు చేస్తూనే ఉంటారు.

**భక్తుడు** : ఇది ప్రతి మనిషికి సాధారణంగా ఉండే అలవాటేనా?

**గురువుగారు :** అది సాధారణమైనదేమీ కాదు. ప్రతి ఒక్కరికీ అలానే ఉండదు. ఈ అలవాటు కూడా రకరకాల స్థాయిల్లో, తీవ్రతలతో ఉంటుంది. కానీ భావోద్వేగం మాత్రం ఒక్కటే – కొంతమంది నాతో ఉండాలనుకుంటారు. నన్ను చూడాలనుకుంటారు, కానీ వాళ్ళు తాము అప్పటివరకూ పొందిన అవకాశాలను మర్చిపోతారు. ఎప్పుడూ వాళ్ళకు లేనిదాని గురించే ఆలోచిస్తూ ఉంటారు. మీలో కొందరికి కూడా ఈ అలవాటు ఉంది. కొంతకాలంగా నేను దానిని పోగొట్టడానికి ప్రయత్నిస్తున్నాను. ఏదైనా ఒక వ్యక్తీకరణ గౌరవప్రదంగా ఉందా లేదా అనే విషయంలో నేను చాలా నిక్కచ్చిగా ఉంటానని అందరూ అనుకొంటారు. కానీ అది ఇది కాదు. వాళ్ళు వ్యక్తం చేసిన పద్ధతి కాదు, అలా వ్యక్తం చేయడానికి గల కారణాలు ముఖ్యం – అది విషయాలపట్ల వారి దృక్పథాన్ని తెలియజేస్తుంది. ఇలా చేయడం వల్ల వాళ్ళు దేనినీ ఆనందించలేరు. జీవితంలో సాధారణంగా ఉండే మధురిమను కోల్పోతారు. ఎప్పుడూ వారి వద్ద లేని వాటి గురించి ఆలోచిస్తూ ఉన్నదాన్ని గురించి తెలుసుకోలేరు. వాళ్ళు తమ దగ్గర ఉన్నదాని మీదకు తమ దృష్టిని మళ్ళించడం ద్వారా ఆనందాన్ని చాలావరకు అనుభూతి చెందవచ్చు. మిగిలింది బాబా ఎలానూ ఇస్తారు. మీకు ఏమి లేదో దాని గురించి చెప్పవచ్చు కానీ ఫిర్యాదులుగా




**సాధనా ఫలాలు :** సాయిపట్ల ప్రేమను పెంపొందించి, సదా శ్రీసాయి ఊసు, ధ్యాసలలో ఉండేట్లు, చేయడమే సాధనామార్గాల పరమ లక్ష్యం. మన హృదయాంతరాళాల్లో ఉన్న ప్రేమను పైకి వచ్చేట్లు చేయడమే కాకుండా, సాయి ప్రేమానుగ్రహాన్ని గుర్తించే హృదయ యోగ్యతను మనకు ఈ సాధనాలు ప్రసాదిస్తాయి అని గురుదేవులు సాధనా ఫలాలను వివరించారు.

చెయ్యవద్దు - దానికి బదులు మీకు ఏమికావాలో అడగండి.

**భక్తుడు** : మనలోని పరివర్తన మనకు ఇంత ప్రాథమికమైన అంశమైనపుడు మనం దాన్ని ఎందుకు గుర్తించలేము?


**గురువుగారు :** ఎందుకంటే అది నీకంటే భిన్నమైనది కాదు. నువ్వు, 'నేను' అని అనుకొనేది నీ భావోద్వేగాల ఫలితమే. నీకు బయటకు కనిపించే లక్షణాలను బట్టి లేదా గతంతో పోల్చిచూసుకున్నప్పుడు "నేను అంతకుముందు అలా ప్రతిస్పందిచేవాడిని. ఇప్పుడు ఇలా స్పందిస్తున్నాను" అనుకోవచ్చు. మీ ప్రతిస్పందనల ద్వారానే మీరు మీలోని మార్పును చూడగలరు. కానీ ఆ మార్పును నేరుగా చూడలేరు. ఎందుకంటే మిమ్మల్ని మీరు చూసుకోలేరు. మీరు ఒక్కరే మారారు అనే విషయం ఏదైనా సంఘటన జరిగిన తరువాతే మీకు కనిపిస్తుంది. అంతేకానీ అంతఃదృష్టితో దానిని చూసుకోలేరు. ఎందుకంటే ఆ మార్పు మీ లోపల జరుగుతుంది. ఒకవేళ మీకు నిజంగా ఇలాంటి మానసిక విశ్లేషణ పట్ల అంత ఆసక్తిగా ఉండి - ఈ ఆలోచన, ఆ ఆలోచన, ఈ స్పష్టత, ఆ అస్పష్టత - అని మిమ్మల్ని మీరు విశ్లేషించుకోవాలనుకొంటే "నేను అంతకుముందు ఎలా ఉన్నాను, ఇప్పుడు ఎలా ఉన్నాను, నాలోని మార్పు ఏమిటి?" అనే విషయాల మీద దృష్టిపెట్టండి. ముందు మీరు ఎలా మారారు అనే సంగతి తెలుస్తుంది. మీరు ఆ మార్పుని ఆనందిస్తారు. మీకు అంత ఇచ్చిన సద్గురువు ఆ మిగతాది (పరిపూర్ణ ఆనందం) ఇవ్వలేరా? మీకు ఇచ్చిన దానిని అనుభవించకుండా, మీకు ఇవ్వబోయే దానిని స్వీకరించడానికి సిద్ధం కాకుండా ఉండటం ద్వారా మీకు మీరు ఇంకా ఇంకా అడ్డంకులు సృష్టించుకొంటున్నారు.

**భక్తుడు** : గురువుగారూ! ఎప్పుడూ అంతర్ముఖమో లేదా బహిర్ముఖమో ఏదో ఒక మార్గంలో మాత్రమే ప్రయాణించాల్సివస్తుందేమో అనిపిస్తోంది. కానీ రెండింటినీ పెంపొందించుకోవడానికి మార్గముందా?

**గురువుగారు :** ఉంది. అలా ఉండటం మంచిదే. అదే బాబా మార్గం. ఆయన మిమ్మల్ని కేవలం అంతర్ముఖంగానో లేక కేవలం బహిర్ముఖంగానో వెళ్ళమని చెప్పరు. అక్కడ రెండూ ఉండాలి. నా దగ్గర జరిగేదీ అదే. ఎందుకంటే నేను ఒకదాని కోసం మరొకదానిని వదలిపెట్టమని చెప్పను. రెండింటికీ సమాన ప్రాధాన్యత ఉంది.

**భక్తుడు** : మన ఆధ్యాత్మిక జీవితం, ప్రాపంచిక జీవితాల మధ్య సహజంగానే సమతుల్యత వస్తుందా

**శ్రద్ధ :** ప్రేమ ఉన్నచోట శ్రద్ధ దానంతటదే వస్తుంది. అభ్యాసం చేస్తే వచ్చేది కాదది. ప్రేమ పెరిగేకొద్దీ శ్రద్ధ పెరుగుతుంది. మనకు ఏమైనా ఇష్టమైనప్పుడు జాగ్రత్త దానంతటదే వస్తుంది. వాటికి మనమిచ్చే ప్రాధాన్యత, వాటిపట్ల మనకున్న ఇష్టం వల్లనే కదా! ప్రేమ వలన శ్రద్ధ కలుగుతుంది. శ్రద్ధ వలన ప్రేమ జనించదు. అది ప్రేమలో నుండే పుడుతుంది. అది ప్రేమ యొక్క విశిష్ఠ లక్షణం.



లేక అది మనం జాగ్రత్తలు తీసుకోవలసిన అంశమా?

**గురువుగారు :** మనం కూడా జాగ్రత్త తీసుకోవాలి.

**భక్తుడు** : మనలో ఆ బ్యాలెన్స్ ఉందని మనకెలా తెలుస్తుంది?

**గురువుగారు :** ఎక్కడైనా బ్యాలెన్స్ ఉందా లేదా అని మనకు ఎలా తెలుస్తుంది? దానిని తరచి చూసుకొని, ఆ బ్యాలెన్స్‌ను అనుభవించి, బ్యాలెన్స్ చేయడం ద్వారా మనకు తెలుస్తుంది (గురువుగారు నవ్వుతూ..) అప్పుడు ఆ బ్యాలెన్స్ తెలుస్తుంది. ప్రతిక్షణం జాగ్రత్తతో ఉండి, మనం చేసే పనుల పట్ల ఎరుకతో ఉండటం, మీరు నిజంగా బ్యాలెన్స్‌గా ఉన్నారా లేక ఏదో ఒకవైపుకి ఒరిగి ఉన్నారా? జాగ్రత్తగా ఉండండి. లేకపోతే ఏదో ఒకవైపుకు పడిపోతారు!

**భక్తుడు** : దానిని తెలుసుకోవడానకి ప్రమాణమేమిటి?

**గురువుగారు :** మీ అనుభవాన్ని బట్టి తెలుసుకోవచ్చు. మీరు బ్యాలెన్స్‌గా ఉన్నారంటే ఇదే దానిని తెలుసుకోవడానికి పద్ధతి. మీరు సైకిల్ త్రొక్కడం నేర్చుకునేటప్పుడు మీకు నిజంగా సైకిల్ వచ్చిందా, రాదా అని చెప్పడానికి ఏంటి ప్రమాణం.

**భక్తుడు** : సైకిల్ వస్తే నేను పడిపోను.

**గురువుగారు :** అదీ విషయం. (నవ్వులు...) అప్పుడు మీరు బ్యాలెన్స్ చేయడం నేర్చుకున్నారన్నమాట. మీరు ఒకసారి పడతారు, లేస్తారు, మళ్ళీ ప్రయత్నిస్తారు. మళ్ళీ పడిపోతారు – మీకు దెబ్బలు కూడా తగలవచ్చు – చివరికి మీకు సైకిల్ త్రొక్కడం వచ్చేస్తుంది. ఒక్కసారి నేర్చుకున్నాక మీరు తొక్కకపోయినా, చేతులు వదిలేసినా మీరు బ్యాలెన్స్ చేయగలుగుతారు. సైకిల్ హ్యాండిల్ కూడా పట్టుకోకుండా మీరు రద్దీగా ఉన్న రోడ్డులో కూడా వెళ్లవచ్చు. మీరు శరీరం యొక్క గురుత్వాకర్షణ కేంద్రం పైన దృష్టిపెడితే మీరు సైకిల్‌ను ఎలా కావాలంటే అలా త్రిప్పవచ్చు! (నవ్వులు....) ఆ రోజులలో మేము "కోట నుండి విద్యానగర్ దాకా చేతులు వదిలేసి వెళ్ళాలి" అనుకొనేవాళ్ళం. ఇంటి నుండి కాలేజీ లోపలికి వెళ్ళేదాకా చేతులు పట్టుకోకుండా వెళ్ళేవాళ్ళం. తరువాత అలానే సైకిల్ స్టాండ్ కూడా వేసేవాళ్ళం. ఒక్కసారి మీకు బ్యాలెన్స్ చేయడం వచ్చేశాక మీరు ఎన్ని రకాల విన్యాసాలైనా వెయ్యవచ్చు (నవ్వులు...)

**భక్తుడు** : మేము దేంట్లోనైనా చిక్కుకోవడం వలన మాకు కనీసం పడిపోయిన సంగతి కూడా తెలియకపోవచ్చు కదా.




**గమ్యం :** మన జీవిత గమ్యం ఏమిటి? ఏం చేస్తే గమ్యానికి చేరువవుతామో గ్రహించాలి. మన కార్యకలాపాలు, మనసు, బుద్ధి, చిత్తం, మన మార్గాలు, అన్నీ ఆ గమ్యంవైపుకి మళ్లించాలి. లేని పక్షంలో మనమిక్కడ ఉండటం అర్ధ రహితం.

**గురువుగారు :** ఖచ్చితంగా తెలుస్తుంది! మీరు గుర్తించకపోయినా మీకు తగిలిన దెబ్బలు చెబుతాయి మీరు పడిపోయారని (నవ్వులు..) మీరు పడిన బాధ, దుఃఖం, అసంతృప్తి, నిరాశానిస్పృహలు – ఇవన్నీ మీరింకా బ్యాలెన్స్ చేయడం నేర్చుకోలేదు అని చెప్పే 'గాయాలు'.

**భక్తుడు** : గురువుగారూ! మన వ్యక్తిత్వంలో పరివర్తన రావడానికి, పరిపూర్ణమైన ఆనందం రావడానికి సంబంధం ఉందా?

**గురువుగారు :** సంబంధం ఉండాలి. మన వ్యక్తిత్వం ఇలా ఉండటం వల్లనే మనకు ఆ పరిపూర్ణమైన ఆనందం రావడం లేదు. అది మారేదాకా మీరు పరిపూర్ణమైన ఆనందాన్ని పొందలేరు. ఎవరైనా ఒకరికి ఆధ్యాత్మిక అనుభవం వచ్చిందంటే ఆ అనుభవమే ప్రధానం కాదు. ఆ అనుభవం పొందిన వ్యక్తిలో కూడా పరివర్తన వచ్చిఉండాలి. సాధారణంగా అందరూ అనుభవం పొందిన వ్యక్తిని వదలి అనుభవం మీదనే ఎక్కువ దృష్టిపెడతారు. అనుభవం పొందిన వ్యక్తి గురించి ఆలోచించరు. నిజానికి అనుభవం వల్ల మారేదేమిటంటే అనుభవం పొందిన వ్యక్తి స్థితి – అదే పరివర్తన అంటే. ఒక వ్యక్తి ప్రస్తుత స్థితి మారిన తరువాత అనుభవం వస్తుంది. ఆ అనుభవం అనేది కంటికి కనిపించే వస్తువులాంటిది కాదు.

అది మన వ్యక్తిత్వంలోనూ, మన అహంకారంలోనూ జరిగే మార్పు. మీరు దానిని ఏ పరిభాషలో పిలిచినా సరే – ముఖ్యమైనది మార్పు. అందుకే నేను అనుభవానికి అంత ప్రాముఖ్యతను ఇవ్వను. నేను మీకే ప్రాముఖ్యతనిస్తాను! నిజానికి నేను మీ గురించే ఎక్కువ జాగ్రత్త వహిస్తాను. అందుకే నేను ఆ చరమానుభవం – ఆ బ్రహ్మం గురించి, బుద్ధత్వం, నిర్వాణం ఇలాంటివాటి గురించి మాట్లాడను. నాకు మీరే ప్రధానం.

**గురువుగారు :** ఒకవేళ మీరు కాస్త పురోగతి సాధిస్తే, అది ఏదైనా కానివ్వండి. దాని మీద దృష్టి పెట్టండి. అస్సలు పురోగతి శూన్యమైతే అది వేరే సంగతి. కానీ నాకు తెలిసినంతవరకు ఇక్కడ అటువంటి పురోగతి శూన్యమైనవారు ఎవ్వరూ లేరు.

**భక్తుడు** : మేము ఎక్కడ, ఎంత దూరంలో ఉన్నాం గురువుగారూ?

**గురువుగారు :** ఒక పర్లాంగు, ఒక కిలోమీటరు, రెండు కిలోమీటర్లు, పది కిలోమీటర్లు, ఇరవై కిలోమీటర్లు.

**ఎరుక :** మనం ఎందుకు ఇక్కడికి వచ్చాము? మనం చేయవలసినదేమిటి? చేస్తున్నదేమిటి? మనమేం పొందాలి? పొందుతున్నదేమిటి? అనే విషయాలు నిరంతరం గుర్తుంచుకోవాలి. వీటిని ఎప్పుడూ మరచిపోకూడదు. మరపనే చావుని తప్పించుకోవాలంటే సంపూర్ణ ఎరుక అవసరం.



కృప

(నవ్వులు...) మీరు ట్రెక్కింగ్ (పర్వతారోహణ) చేస్తున్నారు, దానిని ఆస్వాదించండి! (నవ్వులు...) ప్రకృతిని ఆస్వాదించండి. మీరలా ఎక్కుతున్నప్పుడు ఎంతదూరం నడిచారు, ఎన్ని అడుగులు వేశారు అనే విషయాన్ని మీరు లెక్కపెట్టుకోరు. "అయ్యో ఇంకా ఒక ఫర్లాంగు నడవాలే, దేవుడా!" అనుకోరు. అలా అనుకుంటే అది ట్రెక్కింగ్ కాదు. మీకు ప్రకృతంటే ఇష్టం అని చెప్పారు. కాబట్టి ఈ పయనాన్ని ఆస్వాదించండి. సాయిపథంలో పయనం ఇది. దూరమెంతని చూసుకోకుండా, అడుగులు లెక్కపెట్టుకోకుండా నడవండి. చాలా చాలా చాలా దూరం ప్రయాణించలసి ఉంది, నేను దానిని కాదనడం లేదు. కానీ మనం ఈ కాస్త దూరం ప్రయాణించాం, దానిని ఆస్వాదిద్దాం. అప్పుడు ప్రారంభం నుండి చివరిదాకా మనం వేసే ప్రతి అడుగు అందంగా, ఆహ్లాదంగా ఉంటుంది.

## అసహాయత - అనుగ్రహం *నవంబర్ 2014*



**భక్తుడు** : గురువుగారూ! అప్పుడప్పుడూ మాకు అనుభవమయ్యే నిస్సహాయస్థితి నుండి బయటపడే మార్గం ఏమిటి?

**గురువుగారు :** సహాయం కోసం చూడటమే! (గురువుగారు నవ్వుతూ..)

**భక్తుడు** : మీ ఉద్దేశ్యంలో సహాయం కోసం చూడటం అంటే ఏమిటి?

**గురువుగారు :** మీకు మీ నిస్సహాయత నిజంగా అనుభవమైనపుడు మీరు ఆ నిస్సహాయస్థితి నుండి బయటపడటానికి ప్రయత్నిస్తారు. దాని నుండి బయటపడాలన్న ఆ కోరికే సహాయం కోసం అన్వేషించడమంటే. ఈ విషయం మీకు తెలియకపోయినప్పటికీ ఆ పాటికే మీరు సహాయం కోసం చూస్తుంటారు. అది అనివార్యంగా జరుగుతుంది, ఆ సహాయం అందినపుడు మీరు మీ నిస్సహాయతను అధిగమించారన్న అనుభవం కలుగుతుంది. మీరు ఆ సహాయాన్ని పొందినపుడు అది మీలోని నిరాశానిస్పృహలను తొలగిస్తుంది.

**భక్తుడు** : అంటే, ఆ నిస్సహాయత మమ్మల్ని బాబాకు దగ్గర చేస్తుందా?




**ఆధ్యాత్మికత :** అదేదో సనాతన సాంప్రదాయం, ఆచార వ్యవహారాలకే పరిమితమైనదని భ్రమిస్తాం. ప్రాపంచిక జీవితానికి, వ్యవహారాలకు అతీతమైనదని భావిస్తాం. ప్రాపంచిక విషయాలను వదులుకుంటేనే ఆధ్యాత్మికత వంటబడుతుందని విశ్వసిస్తాం. ఈ భావనలతో బందీయైన మనస్సును సాయితత్త్వ భావనలతో ప్రక్షాళన చేసి ఆధ్యాత్మికతను సాయిపరంగా సరిక్రొత్త కోణంలో దర్శింపచేసి, ఆధ్యాత్మికతపట్ల సరియైన దృక్పథాన్ని అలవరిచారు శ్రీబాబూజీ.

**గురువుగారు :** ఆ నిస్సహాయత వల్ల మనకు బాబా అవసరం మరింత ఎక్కువవుతుంది. మనకేదైనా అవసరమైనపుడు ఆ అవసరమైన దానిని పొందడం మనకు ఇంకా ఎక్కువ ఆనందాన్ని ఇస్తుంది.

**భక్తుడు** : అప్పుడిక మనకు ఆ నిస్సహాయత అనుభవం కాదా?

**గురువుగారు :** అవును. అప్పుడిక మనకు ఆ నిస్సహాయత కలగదు. మనకు సహాయం నిండుగా ఉందనిపిస్తుంది. బాబా మనకు అండగా ఉన్నారనిపిస్తుంది. ఎందుకంటే బాబానే ఆ సహాయం కాబట్టి.

**భక్తుడు** : గురువుగారూ! సద్గురువును సహాయం కోరడానికి, అనుగ్రహం కోసం ప్రార్థించడానికి ఉత్తమమైన మార్గం ఏమిటి?

**గురువుగారు :** సహాయం పొందాలనే తీవ్రమైన కోరిక ఉండటం, ఆ సహాయం మీకు ఎంతో అవసరం అవడం ఉత్తమమైన మార్గం. ఉదాహరణకు, మీరు ఓ ప్రవాహంలో పడి కొట్టుకు పోతున్నారనుకోండి. మీరు ఏం చేస్తారు? మీకు ఏది దొరికితే దానిని పట్టుకుంటారు. అక్కడ పట్టుకుందామా వద్దా అనే డైలమా (మీమాంస) ఉండదు. "ఈ చిన్న కర్ర నన్ను ఒడ్డుకు చేర్చగలదా, దానికి అంత బలం ఉందా?" ఇలాంటివేవీ ఆలోచించం. ఏది దొరికితే దానిని పట్టుకుంటాం!

కాకడ ఆరతిలోని చివరి గీతాన్ని చదవండి. సహాయం ఎలా కోరాలో మీకు తెలుస్తుంది. "మీ బుడతో భవభయడోహీ ఉద్ధరా!" (సద్గురూ, మమ్మల్ని రక్షించడానికి ఉన్న పళంగా తరలిరండి) అని ఉంటుంది. అదృష్టవశాత్తూ మనకు బాబా అనే అత్యుత్తమమైన రక్షణ ఉంది, కానీ అసలు విషయం ఏమిటంటే మనకు అంత రక్షణ అవసరం లేదని భావిస్తుంటాం. కాబట్టి మనం ఎప్పుడూ బాబాను కాస్త ఆగమని చెబుతూ ఉంటాం. "బాబా, మీరు సహాయం చెయ్యగలరు, మంచిది. కానీ మీరు కాసేపు ఆగండి. నాకు సహాయం అవసరమైనపుడు నేను పిలుస్తాను. మీరిచ్చిన ఆఫర్‌కు ధన్యవాదాలు" అంటాం (గురువుగారు నవ్వుతూ...)

మీకు జీవితంలో ఎన్నో అవసరమై ఉంటాయి. మీరు సహాయం అడిగి ఉంటారు. ఎలా అడగాలో ఎవ్వరూ నేర్పలేదు. పసిబిడ్డలా ఉన్నప్పుడు మీ అమ్మ సహాయం తీసుకొని ఉంటారు. అమ్మని సాయం అడగాలని నీకు ఎవరు నేర్పించారు? మీరు ఎంతో దూరం ప్రయాణం చేసి మీ మీ దేశాల నుండి ఇక్కడకు వచ్చారు. మీరు ఎన్నో విషయాలలో ఎంతోమంది సహాయం తీసుకొని ఉంటారు. అవన్నీ

**ఆధ్యాత్మికత :** అన్ని రకాలుగా మనల్ని ఉత్తేజపరుస్తూ ప్రేమను అనుభవింప చేస్తూ, ప్రేమను వ్యక్తీకరిస్తూ, స్పష్టమైన ఆనందాన్ని, తృప్తిని అనుభవ మయ్యేదిశగా నడిపిస్తూ, సంపూర్ణంగా జీవితంలో పాలుపంచుకునేలా చేసి, జీవితాన్ని సాధ్యమైనంత సంపూర్ణంగా అనుభవింప చేసి జీవితానికి నిండుదనాన్నిచ్చి, పరిపూర్ణులను చేస్తుంది.



మీకు ఎవరు నేర్పారు? ముందు మీకొక అవసరం అనేది ఉండాలి. ఆ అవసరమే మీకు ఎలా అడగాలో నేర్పుతుంది. ఆ అవసరమే దానిని తీర్చుకునే పద్ధతిని, ఆ ప్రక్రియను (టెక్నిక్‌ను) నేర్పుతుంది. ఇది ప్రత్యేకమైనది, ఇది అద్వితీయమైనది. ఇది ఉన్నతమైనదని చెప్పబడే పద్ధతుల కోసం ప్రాకులాడకండి. పద్ధతుల్లో (టెక్నిక్స్‌లో) ఏమీ లేదు. మనకు అవసరం ఉంటే మనకు తగిన పద్ధతిని మనమే కనుక్కుంటాం. క్రొత్త ఆవిష్కరణలకు అవసరం తల్లి వంటిది. మన కోసం, మన మంచి కోసం మనం కనుక్కునే పద్ధతే ఉత్తమమైన పద్ధతి.

మీరు ఎప్పుడూ సహాయం కోసం వెతుకులాడమని నేను చెప్పడం లేదు. ముందు మీకు మీరుగా మీ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నించండి. అది అన్నింటికంటే మంచి పద్ధతి. మీ చేతకానప్పుడు, అంతకుమించి వేరే ఛాయిస్ మీకు లేదు – మీరు సహాయం కోసం అన్వేషించాలి. కాబట్టి గురువు అవసరమా? సాయం అవసరమా, లేదా? అన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు. మీకు నిజంగా సాయం అవసరం అయితే గురువును అన్వేషించి ఆయనను ఆశ్రయించండి. అది మీ ఎంపిక (ఛాయిస్) కాదు. అంతకుమించి మీకు వేరే దారి లేదు. 'నాకు వేరే దారి లేదు' అనే స్థితి వచ్చేవరకు మీకు ఏదో (మీకై మీరే సాధించగలరు అనే) ఆశ ఉంటుంది. నాకు ఇంకా కొన్ని అవకాశాలున్నాయి. నేనెందుకు ప్రయత్నించకూడదు అనిపిస్తుంది. అలాంటప్పుడు ప్రయత్నించి చూడండి. ముందు మీకున్న వనరులన్నింటినీ వాడుకుని ప్రయత్నించండి. మీరు విజయం సాధిస్తే మంచిది. అప్పుడది మీకై మీరు సంపాదించుకున్నదవుతుంది. మీరు చెయ్యలేకపోతే, వేరొకరి సహాయం అర్థించక మీరు చెయ్యగలిగినది మాత్రం ఏముంది?

**భక్తుడు** : గురువుగారూ, సరైన మార్గాన్ని ఎన్నుకునే విషయంలో తప్పు చేస్తానేమోనని, సరైన మార్గాన్ని ఎంపిక చేసుకోలేనేమోనని భయంగా ఉంటుంది. ఈ విషయంలో నేనేం చెయ్యాలి?

**గురువుగారు :** మీకు ఏం కావాలో ఆ లక్ష్యాన్ని, ఆ విషయాన్నే మీరు ఎంపిక చేసుకుంటారు. దానిని పొందే విషయంలో మీకు ఏవైనా భయాలు ఉంటే, దానిని సాధించడానికి మార్గం తెలియకపోతే బాబా వంటి సద్గురువుల పాత్ర అవసరం అవుతుంది. మీకు దానిని ఎలా పొందాలో తెలిస్తే మీకై మీరే ప్రయత్నం చేసి ఆ లక్ష్యాన్ని సాధించండి. కానీ ఒకవేళ మీకు కావలసిన వనరులు లేకపోతే, మీరు




**ప్రేమ :** మనలో ప్రేమ యొక్క అనుభవం ఉంది కానీ, అది బలహీనంగా ఉంది. ఆ ప్రేమను ఇంకా బలీయంగా చేసుకోవడానికి మార్గం ఒక్కటే - అది ప్రేమను ఇంకా ఎక్కువ వ్యక్తీకరించడమే. ప్రేమను ఎంత ఎక్కువగా వ్యక్తీకరిస్తామో, అది అంతగా పెరిగి మరింత అనుభవంలోకి వస్తుంది. ప్రేమతో చేసే ఏ కార్యమైనా అది పనిలాగా అనిపించదు. అది ప్రేమను వ్యక్తపరిచే విధానమవుతుంది.

చేస్తున్నది సరైనదో కాదో తెలియక మీకు భయంగా ఉండి మీరు ఎంతో నిస్సహాయంగా మారినపుడు బాబా నుండి సహాయాన్ని అర్థించండి. ఆ సహాయం దేనికి? మీకు కావలసిన, అవసరమైన మీ వ్యక్తిగత గమ్యాన్ని చేరుకోవడం కోసమే.

**భక్తుడు** : గురువుగారూ, ఎంపిక చేసుకోవడానికి అంత ప్రాధాన్యతనిచ్చే ఆ ఎమోషన్ (భావోద్వేగాన్ని) ఏమిటి?

**గురువుగారు :** ప్రతిసారీ తప్పనిసరి పరిస్థితులలో నిస్సహాయంగా ఏదో ఒక దానిని ఎంపిక చేసుకోవాల్సిన పరిస్థితి నుండి బయటపడాలన్న మౌలికమైన ఎమోషన్ (భావోద్వేగం) అది. సరిగ్గా ఎంపిక చేసుకోలేని మన దౌర్బల్యం నుండి బయటపడటం కోసం మనలో కలిగే తపనది.

**భక్తుడు** : అలా అయితే నిస్సహాయస్థితి నుండి బయటపడాలన్న కోరిక నిజానికి చాలా బలమైన భావోద్వేగమన్నమాట.

**గురువుగారు :** నిజమే, అది చాలా బలమైన భావోద్వేగం (ఎమోషన్). నీ ఉనికికి మూలం అదే. అసలు మన పుట్టుకే మన ఎంపిక కాదు. అది మన చేతుల్లో లేదు. మీరు ఎవరినైనా "మీరు ఎందుకు జీవిస్తున్నారు" అని అడిగి చూడండి. వారివ్వగలిగిన ఒకే ఒక సమాధానం, "ఇంకా మేము చనిపోలేదు కాబట్టి" అని! మన అస్తిత్వం అంత నిస్సహాయంగా ఉంది. మనం కేవలం నిస్సహాయంగా బ్రతుకుతున్నాం. ఎంత దౌర్భాగ్యమైన స్థితి అది. మనం ఆ నిస్సహాయమైన స్థితిని అధిగమించడానికి, ఆ విచారకరమైన స్థితి నుండి మనల్ని మనం విడుదల చేసుకోవడానికి మనం చేసే ప్రయత్నం మొదలైనవన్నీ వస్తాయి. మనకు ప్రకృతి ప్రసాదించిన జీవితమనే పుస్తకంలో ఒక్క పదాన్ని కూడా సరిగా అర్థంచేసుకోకుండా మనం పేజీలు త్రిప్పేస్తున్నాం. అది ఎవరు వ్రాసారో, ఎందుకు వ్రాసారో, అందులో ఎన్ని పేజీలున్నాయో కూడా మనకు తెలియదు.

**భక్తుడు** : వీటన్నింటినీ ఒక చోటుకు తీసుకురావడానికి మనకు మరో బలమైన భావోద్వేగం యొక్క అవసరం ఉందని మీరు చెప్పారు. ఆ భావోద్వేగం కూడా మన ఎంపిక కాదు, మేము త్రిప్పుతున్న పేజీలలో అది ఎక్కడో వస్తుంది.

**గురువుగారు :** అవును అది కూడా మీ చేతులలో లేదు. కానీ అది మిమ్మల్ని మీ నిస్సహాయస్థితి నుండి

**పూజ :** నా దగ్గరకు రావడం, నమస్కారం చేసుకోవడం, పువ్వులు సమర్పించడం ఈ ఆచారాలన్నీ ప్రేమ యొక్క వివిధ భావ ప్రకటనలు. అవి ప్రేమను వ్యక్తపరిచే భావాలయినప్పుడు అవి నిజమైన పూజావిధులు. అలా కాకపోతే వాటికి విలువలేదు. భజన కానీ, ఆచారం కానీ ఏ విధమైన పని కానీ - అది ప్రేమను వ్యక్త పరిచినప్పుడు - పూజ అవుతుంది.



బయటపడేలా చేస్తుంది. ఒక్క పదం కూడా అర్థం చేసుకోకుండా పేజీలు త్రిప్పుతున్నప్పుడు నిజానికి మీకు సాయపడేది ఏమిటి? మీకు ఆ పుస్తకంలో – ఆ భాష, అక్షరాలు, వ్రాసే పద్ధతి, వ్యాకరణం – మొదలైన వాటిని నేర్పించడానికి మీకు ఎవరో ఒకరు కావాలి. అప్పుడు మీరు జీవితమనే పుస్తకాన్ని ఆస్వాదించగలుగుతారు.

**భక్తుడు** : గురువుగారూ! నేను నిస్సహాయుణ్ణి అని నేను అనుకోవడం లేదు. అందుకే నేను నిజంగా సహాయం కావాలనుకోవడం లేదు. ఇలాంటప్పుడు నేనేం చెయ్యాలి?

**గురువుగారు :** మీకు మీ నిస్సహాయత పూర్తిగా అనుభవంలోకి రావాలి. ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా ఈ నిస్సహాయత అనుభవమవుతుంది. సహాయం కూడా అలానే రకరకాల మార్గాలలో అందుతుంది. సహాయం కోసం ప్రయత్నించే పద్ధతి. వారికి సాయం అందే పద్ధతి మనిషికి మనిషికి మారుతూ ఉంటుంది. బుద్ధుడు ఎంతగానో ప్రయత్నించాడు. ఒక స్థాయిలో ఆయనకు తన నిస్సహాయత అనుభవంలోనికి వచ్చి అన్ని సాధనలు, అన్ని ప్రయత్నాలకు స్వస్తిచెప్పి బోధి వృక్షం క్రింద కూర్చుండిపోయాడు. ఆయన అప్పటివరకు చేస్తూ ఉన్న అన్నింటినీ వదిలిపెట్టేశాడు, అప్పుడు ఆ స్థితిలో – ఆ నిర్వాణం, పరిపూర్ణత్వం, సమాధానం, మీరు దానిని ఎలా పిలిచినా సరే – ఆయనకు అది తక్షణం సిద్ధించింది. బుద్ధుడు సైతం ఆ నిస్సహాయస్థితిని, అన్నింటిని వదిలిపెట్టాల్సిన స్థితిని అనుభవించాల్సి వచ్చింది. కానీ మన విషయం వేరు. మన సాధన, ప్రయత్నం, అవసరం అంత తీవ్రంగా ఉండదు, కాబట్టి సహాయం కోసం మన అవసరం కూడా అంత తీవ్రంగా ఉండదు. మనం ఎంత నిస్సహాయులమో చూపడానికి కూడా మనకు ఇంకొకరు కావాలి. అదీ మన పరిస్థితి (నవ్వులు..) లేదూ, మనం బుద్ధుడులాగా అయ్యి అన్నీ వదలిపెట్టేయగలిగితే మంచిది. బుద్ధుడు ఆ నిర్వాణస్థితిని పొందిన తరువాత ఆయన తన మార్గం గురించి చెబుతూ, 'బుద్ధం శరణం గచ్ఛామి' అన్నారు. అంటే బుద్ధునికి శరణం పొందుతున్నాను అని అర్థం. బుద్ధుడు దేనికి (ఎవరికి) శరణు పొందాడో మనకు తెలియదు. ఆయన తనకే శరణుపొందాడో, తన నిస్సహాయస్థితికి శరణు పొందాడో లేక మరో దానికో – అదేమిటో చరిత్రలో ఎక్కడా వ్రాయబడలేదు. అది ఈ విధంగానే ఉండాల్సిన అవసరం లేదు. అది చాలా రకాలుగా జరుగవచ్చు. మన నిస్సహాయతను తెలుసుకొని (వ్యక్తం చేస్తూ) ఒక బుద్ధుని (బుద్ధత్వం




**అనుగ్రహం :** అనుగ్రహం ఎప్పుడూ ఉండేదే. మనం ఉపయోగించుకోవడంలోనే ఉంది. మనం పురోభివృద్ధి చెందడం లేదంటే, అనుగ్రహం లేదని అర్థం కాదు. మనం ఉపయోగించుకోవడంలేదని అర్థం. అనుగ్రహం వర్షంలా పడుతుంటే... మనం అహంకారమనే గొడుగు అడ్డం పెట్టుకొంటున్నాం. ఈ గొడుగు తొలగిస్తే అనుగ్రహ వర్షంలో తడిసి ముద్దవుతాం.

పొందిన వ్యక్తిని), సద్గురువు పాదాలకు శరణు పొందాలని బుద్ధుని ఉద్దేశ్యం. ఎవరైతే తమ నిస్సహాయతను అనుభవిస్తారో వారే శరణాగతి పొందుతారు.

బాబా జీవితంలో కూడా ఆయన తమ నిస్సహాయతను ఎలా అనుభవించారో అనే విషయాన్ని చూడవచ్చు. కానీ ఆయన దానిని వేరే రకంగా వ్యక్తం చేసారు. "నేను అల్లా బానిసను" అని చెప్పేవారు బాబా. ఆయన అల్లా మీద ఎలా పూర్తిగా ఆధారపడి ఉన్నారో చూడండి. రమణమహర్షి మరో రకంగా వ్యక్తం చేసారు. ఆయనకు తమ నిస్సహాయత మరణానుభవమనే అత్యంత నిస్సహాయస్థితిలాగా అనుభవమైంది. అక్కడ ఆ స్థితిలో ఎవరైనా జీవితాన్ని నిలుపుకోవాలనుకుంటారు. కానీ దానిని నిలుపుకోవడంలో వాళ్ళు అశక్తులు. ప్రాణం పోతుంది - ఇదే మరణం అంటే. రమణులు తమ నిస్సహాయతను మరణంలాగా భావించారు. వాళ్ళందరూ తమ నిస్సహాయస్థితిని రకరకాలుగా వ్యక్తం చేసి రకరకాల మార్గాలలో సాయం అర్థించారు. వారికి సహాయం అందింది కూడా వివిధ రకాలుగానే. అది చాలా వ్యక్తిగతమైనది. కాబట్టి, మీ నిస్సహాయతను అనుభవించండి. సహాయాన్ని కోరండి, మీదైన మార్గంలో సహాయాన్ని పొందండి.

**భక్తుడు :** మనకు సాయం చెయ్యడానికి వేరెవరన్నా ఉన్నప్పుడు మన నిస్సహాయతను మనం ఆనందంగా ఆస్వాదించగలమా?

**గురువుగారు :** ఈ నిస్సహాయత నిజంగా నిస్సహాయత కాదు. అది మరో రకంగా అనుభవమవుతుంది. పెద్దవాళ్లం కాబట్టి మనకు ఈ విషయం అర్థం కావడం కష్టం. ఒక నెల పసిబిడ్డ విషయమే తీసుకోండి. ఆ బిడ్డ నిజంగా నిస్సహాయంగా ఉంటుంది. తాను నడవలేదు, తనను తాను రక్షించుకోలేదు, ఆహారం తీసుకోలేదు, తనకు తానుగా ఏమీ చేసుకోలేదు. తన మనుగడ యావత్తూ తల్లిమీద, లేదా సంరక్షకుని మీద ఆధారపడి ఉంటుంది. కానీ ఆ బిడ్డ ఎంత ఆనందంగా ఆడుకుంటుందో చూడండి. "నీ నిస్సహాయతకు నువ్వు సిగ్గుపడాలి, నీ ఆహారం నువ్వు తయారుచేసుకోలేవు. నువ్వు ప్రతి విషయానికి ఎవరిమీదైనా ఆధారపడాలి, అయినా నువ్వు ఎలా సంతోషంగా ఉంటావు" అని అంటుందా తల్లి? (గురువుగారు నవ్వుతూ...) తన తల్లి సంరక్షణ, ప్రేమ ఉన్నంతవరకు ఈ నిస్సహాయత నిస్సహాయతగా ఆ బిడ్డకు అనుభవం కాదు. మనం పెద్దవాళ్ళమైనప్పటికీ ఈ నిస్సహాయత విషయంలో మనం పిల్లలమే.

**స్వభక్తేచ్ఛాయ మానుషం దర్శయంతం :** "నేను నా భక్తుల కోసం వచ్చాను. నా భాండా గారాన్ని తెరచి నేను మీ కోసం కాచుకోనున్నాను" అని మనం ఆయన కోసం పడేటువంటి ఆర్తి కంటే కూడాను, ఆయనకు మనపట్ల పడేటువంటి ఆర్తి ఎక్కువ. ముందు మనల్ని ఆయనే చూస్తారు. ఆ తరువాతే మనం ఆయనను చూస్తాం. ఆయన అనుగ్రహ దృష్టే మనమీద పడుతుంది. మన గురించి మనకంటే ఆయనే ఎక్కువ తాపత్రయపడుతున్నారు.



మనకు అలాంటి రక్షణను, భద్రతాభావాన్ని ఇచ్చే తల్లి కావాలి. మనకు ఆ రక్షణ ఉన్నప్పుడు మన నిస్సహాయత విషయంలో మనం బాధపడటం మానేస్తాము. నిజానికి మనం సంరక్షణలో ఉన్నట్లు భావిస్తాము. ఆ నిస్సహాయతను నువ్వు ఆనందిస్తావని కాదు, అది మరో రకంగా అనుభవమవుతుంది. మనకు ఆనందాన్నిచ్చేది ఆ సంరక్షణ. సరిగ్గా అదే బాబా చేస్తారు, అందుకే మనకు సద్గురువు అవసరం. అది లేకుండా కూడా ముందుకు వెళ్ళవచ్చు. కానీ మనలో చాలామందికి అది మనం కూర్చున్న కొమ్మను నరుక్కోవడంలాగా ఉంటుంది.

**భక్తుడు** : గురువుగారూ! నేను సహాయం కోసం బాబాను అడిగినప్పటికీ, ప్రార్థించినప్పటికీ నాకింకా నిస్సహాయంగా అనిపిస్తే నేను చెయ్యగలిగింది ఏమన్నా ఉందా? నేనలా ప్రార్థించి, ఎదురుచూస్తూ ఉండాలా?

**గురువుగారు :** నేను మీకు చాలాసార్లు చెప్పాను. మీలోని ఆ నిస్సహాయత అనే అనుభవమే సహాయం కోసం అడగడం. దానిని మీరు ఒక పద్ధతిగా, మాటల్లో వ్యక్తం చేయాల్సిన అవసరం లేదు. మీరు చెయ్యగలిగింది ఏమీ లేదు. ఒకవేళ మీరు చెయ్యగలిగింది ఏదైనా ఉంటే మీరు నిస్సహాయులు కారని అర్థం. నేను చెయ్యగలిగింది ఏమీ లేదు అంటూనే నేను ఏం చెయ్యాలి అని అడగడం అర్థం లేని ప్రశ్న కాబట్టి మీరు ఏమన్నా చెయ్యగలిగి వుంటే మీరు నిస్సహాయులు కారు. మీరు ఏమీ చేయలేరు గనుకే మీరు నిస్సహాయులు.

**భక్తుడు** : అప్పుడు నేనిక చెయ్యగలిగింది ఏమిటి?

**గురువుగారు :** (నవ్వుతూ...) మీరు ఏమీ చెయ్యలేరు – మీరు ఆ నిస్సహాయతను అనుభవించడం తప్ప మరేమీ చెయ్యలేరు, మీరు ఎంత నిస్సహాయులో తెలుసుకోండి. చాలామంది నిస్సహాయంగా ఉంటారు, కానీ ఆ విషయాన్ని వారు ఒప్పుకోరు. ఇదీ సమస్య. నేను మిమ్మల్ని దానిని అంగీకరించమంటున్నాను. మీ నిస్సహాయతను తెలుసుకోండి, స్పష్టంగా తెలుసుకోండి. అది చాలు. ఏమి జరగాలో, మీరు ఏం చేయాలో, సాయం ఎలా అందివ్వాలో ఆ విషయాలు బాబా చూసుకుంటారు. మీకు సాయం చెయ్యడానికి మీరు బాబాకు చేసే సాయం అంటూ ఏమీ లేదు. (నవ్వులు....)

**భక్తుడు** : వాచా వ్యక్తం చేయాల్సిన అవసరం లేదా? అడగాల్సిన అవసరం లేదా?




**కింవచనీయం... :** వారికి ఒక వ్యక్తిపై స్థిరమైన అభిప్రాయం కానీ, భావన కానీ ఉండవు. "ఈ వ్యక్తి అలాంటివాడు కాదు, ఇతనితో ఇలా మసలుకోవాలి, ఆ వ్యక్తి అలాంటి వాడు అతనితో ఇలా ప్రవర్తించాలి" అని వారికుండదు. ఒక సంకల్పం కానీ, ప్రతిచర్యకానీ, ప్రవచనం కానీ మన అవసరాలకు అనుగుణంగా వస్తుంటుంది. సత్పురుషులను అర్థం చేసుకోవడంకానీ, వారి గూర్చి మాట్లాడటం కానీ బహుకష్టం. వారిని గురించి వివరించడం ఒక విఫలయత్నమే.

**గురువుగారు :** అది మీకు ఆ తృప్తిని ఇస్తే మంచిదే. అలా వ్యక్తం చేయడం మీ నిస్సహాయతను తెలుసుకుని, అంగీకరించడంలో భాగమైతే అది సరైనదే. వాచా వ్యక్తం చేయడంలో తప్పేమీ లేదు. అది ఒక రకమైన పద్ధతిలా, మీ నిస్సహాయతకు ఒకానొక వ్యక్తీకరణలా మారుతుంది. అంతే.

**భక్తుడు :** గురువుగారూ! మీరు నాకు సహాయం చేస్తున్నారా? చేస్తుంటే అది నాకెందుకు మరింతగా అనుభవం కావడంలేదు?

**గురువుగారు :** ముందుగా మీరు "గురువుగారూ! నాకు మీరు సహాయం చేస్తున్నారా? అని అడుగుతారు. అవును, నేను సహాయం చేస్తున్నాను, కానీ మీరు నేను చెయ్యట్లేదనుకుంటారు. ఒకవేళ మీరు నేను సహాయం చెయ్యడంలేదు అనుకుంటే, "మీరు నిజంగా అడుగుతున్నారా" అంటాను నేను. మీరు నిజంగా అడుగుతున్నట్లయితే, మీరు ఏ రకమైన సహాయాన్ని అడిగారు? మీకు ఎటువంటి సహాయం కావాలి? మరి ఒకవేళ నేను మీకు సహాయం చేస్తే మీరు దానిని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారా? మీరు తీసుకోగలిగిన సహాయాన్ని నన్ను అడగండి. ఇక్కడ తాత్వికతకు చోటులేదు. ఇది చాలా స్పష్టం. సమస్యేమిటంటే, సహాయం అడగటానికి చాలామందికి భయం. ముందు మనకు సహాయం కావాలని తెలుసుకోవాలి. నేను ఇంకో అడుగు ముందుకేస్తాను. మీకు నిజంగా సహాయం కావాలా? ముందు ఎవరి సహాయం లేకుండా మీకు కావలసిన దానిని సాధించడానికి ప్రయత్నించండి. మీకు మీరుగా సాధించడానికి ప్రయత్నించండి. అలా ప్రయత్నం చేసిన తరువాత, "గురువుగారూ, నేను ప్రయత్నం చేసాను, నావల్ల కాదు, మీరు సహాయం చెయ్యండి" అని మీరంటే అప్పుడు సహాయం చెయ్యడానికి సిద్ధం – కానీ అప్పుడు మీరు సహాయాన్ని స్వీకరించాలి. కానీ జరిగేదేమిటంటే అప్పుడు అహం తలెత్తుతుంది. "నాకు మీ సహాయం అక్కరలేదు, నాకు నేను సహాయం చేసుకోగలను, అయినా నాకు అసలు సహాయం ఎందుకు? నాకై నేను సాధించగలను మీరు కాస్త ముందుకు నెడితే చాలు" అంటారు. (గురువుగారు నవ్వుతూ...) ఒకవేళ నేను కాస్త ముందుకు నెట్టినప్పటికీ అది నిజంగా నెట్టడం కాదేమో అనిపిస్తుంది. నిజంగా గురువుగారు ముందుకు నెట్టారా లేక నేను దానిని ఊహించుకుంటున్నానా అని సందేహిస్తారు. (నవ్వులు) ముందు మనకు స్పష్టత కావాలి. మనకై మనం ఏమీచెయ్యలేమనే పరిపూర్ణమైన స్పష్టత రావాలి. సహాయం అడగటానికి అదే అర్హత. అప్పుడు సహాయం అందిస్తే – సహాయం

**విమర్శ :** విమర్శించడం అనేది బాబా మాటల్లో చెప్పాలంటే - పంది పెంటను తినడం వంటిది. ప్రక్కవాళ్ళను విమర్శించేటటువంటివాడు నాలుకతో మానసికంగా వారి మలాన్ని (మనస్సులో ఉండే లోపాలు, బలహీనతలు) తింటున్నాడు. ఇద్దరూ చేసేటటువంటి పని ఒక్కటే. బాబాకు ఇష్టం లేనటువంటి పని చేయడం వలన బాబాకు దగ్గర కాలేము.



కృప

అందించబడుతుంది. నూటికి నూరుశాతం ఆ విషయంలో సందేహం లేదు - మీరు స్వీకరిస్తారు. సాధారణంగా ఈ విషయంలో విఫలం కావడానికి, గందరగోళానికి, భయపడటానికి కారణం వారికి స్పష్టత లేకపోవడమే.

**గురువుగారు :** మీకు మీరు సహాయం చేసుకోలేరని తెలుసుకోగలిగితే, అప్పుడు మీరు ఎటువంటి సంకోచం లేకుండా సహాయం అర్థిస్తారు. "గురువుగారూ, మీరివ్వగలరా, మీరు సలహా ఇస్తారా... మీరిది చేస్తారా..." ఇది కాదు అడిగే పద్ధతి!! దీనికి బదులు మీరు డిమాండ్ చెయ్యాలి. "నాకివ్వండి, నేను మిమ్మల్ని భిక్ష అడుగుతున్నాను, మీ ముందు భిక్షగాళ్ళలో భిక్షగాడిలా నిలబడివున్నాను..." అటువంటి నిజాయితీతో, అంత సంసిద్ధతతో, అవసరంతో అడగాలి.

**గురువుగారు :** సహాయం అర్థించడమంటే అది దుఃఖంతోనో లేక నిరాశానిస్పృహలతోనో కూడుకుని ఉండకూడదు. అత్యంత నిస్సహాయస్థితిలోనే మీకు సహాయం అనుభవమవుతుంది. మీ నిస్సహాయతే మీకు సహాయం అనుభవంలోకి వచ్చేలా చేస్తుంది. ఆ తరువాత మీరు ఒక రక్షణ ఉన్నదన్న భావంతో జీవించగలుగుతారు. అప్పుడు నిస్సహాయులమనే భావం ఉండదు. మీకు పరిపూర్ణమైన అనుగ్రహం (సహాయం), ఆనందం అనుభవమవుతాయి. అప్పుడది (మీ నిస్సహాయత) మీకు ఆనందంగా, పరిపూర్ణంగా, ఉపయుక్తంగా ఉంటుంది. మనకు సహాయం యొక్క అవసరం ఎప్పుడూ ఉంది, మనకు సహాయం చెయ్యడానికి బాబా కూడా ఎప్పుడూ ఉన్నారు.

**సాయి - ప్రేమమాయి .... ఆనందదాయి**
**శిరిడి - సాయిబడి.... ప్రేమ బడి**
**దక్షిణ - వినూత్న రీతిలో శిక్షణ.... ఎల్లప్పుడూ రక్షణ**
**సాయిపథం - పెంచును ప్రేమ బంధం.... మార్చును మన దృక్పథం**
**సన్నిధానం - అదే 'మా' గురుస్థానం....**
**స్పష్టతతో కూడిన ఆనందమే శ్రీబాబూజీ విధానం**




**శ్రేయస్సు :** "నాకు సంస్థలు ముఖ్యం కాదు. వ్యక్తికే ప్రాముఖ్యతనిస్తాను నేను. నాతో సంబంధం ఎవరికైనా వ్యక్తిగతంగానే ఉంటుంది. వారి వారి ఇష్టాలు, సంస్కారాలు, స్వభావాన్ని బట్టి నేను సలహాఇస్తాను. నాకు ప్రతి ఒక్కరూ ముఖ్యమే. ఎవరికి వారు నాకు కావలసినవారే, ప్రత్యేకమైనవారే. వ్యక్తి శ్రేయస్సే నాకు ముఖ్యం" అంటారు శ్రీబాబూజీ.

# మనిషి విలువ ఎంత?

నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, బౌద్ధమత గురువు అయిన దలైలామా ఒకసారి గుంటూరు వచ్చారు. మాట్లాడటానికి ఉపక్రమిస్తున్నారు. ఇంతలో, అక్కడే స్టేజీపై ఒక పురుగు పడి ఉండటం చూశారు. అంతే, వెంటనే "ఈరోజు మనతో కలిసి గడుపుదాం అని వచ్చిన ఒక మిత్రుడు ఇప్పుడే తన తనువు చాలించాడు. కావున, ఈ పురుగు ఆత్మశాంతికై ఒక రెండు నిమిషాలు మౌనం పాటిద్దామే!" అని ప్రార్థన చేశారు, ఆయనతోపాటు వేలమంది ప్రార్థించారు. గొప్పవాళ్ళు చెప్పదలచుకున్న విషయాన్ని డైరెక్టుగా చెప్పరు, ఇన్ డైరెక్ట్‌గా చెప్పి మనల్ని గొప్పగా ఆలోచింప చేస్తారు. దీన్నే చెప్పకనే చెప్పడం అంటారు. ఈ భాగవతం ఉద్దేశ్యం ఏంటంటే "ఒక రోజులో సుమారు లక్షకోట్ల పురుగులు ఇత్యాది జీవరాశులు చనిపోతాయి. అలాంటి ఒక పురుగు చనిపోతే, ఆ పురుగు ఆత్మకోసం ఇన్నివేల మంది మన అమూల్యమైన సమయం వెచ్చించామంటే, బ్రతికున్న పురుగు విలువ ఎంతో తెలుసుకో. ఒక పురుగు జీవితమే అంత విలువైనది అయితే, ఒక సామాన్య మానవుడి జీవితం ఎంత విలువైనదో తెలుసుకో, దానిబట్టి ఈ సభకి ప్రత్యేకంగా వచ్చిన నీ జీవితం ఎంత విలువైనదో తెలుసుకో" అని అర్థం. అంతటి అమూల్యమైన జన్మనిచ్చిన భగవంతుని పట్ల, తల్లిదండ్రులపట్ల ఎంత కృతజ్ఞతా భావం ఉండాలో తెలుసుకో, ప్రపంచ దేశాలన్నీ ఒక్కటే అనే భావంతో ఏర్పాటయిన యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ ప్రారంభోత్సవానికిగాను ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి, రాజాజీ వ్రాసిన పాటను పాడారు. ఈ పాట గాంధీ, నెహ్రూ, హెలెన్ కెల్లర్ వంటి చాలా మందికి ప్రాణప్రదమైన పాట. అది "కురై ఓన్రుం ఇల్లై మరై మూర్తి కన్నా... కురై ఓన్రుం ఇల్లై కన్నా"... అనగా "దేవుడా నాకు అన్నీ ఇచ్చావు, అదిలేదు, ఇది లేదు అని నిన్ను నిందించను, తిట్టుకోను" (గాంధీ, నెహ్రూలు చనిపోయినప్పుడు వారి కోరిక మేరకు ఆల్ ఇండియా రేడియో 12 రోజులు ఈ పాటతోనే నివాళులర్పించింది).

సుమారు 4 సంవత్సరాల క్రితం ఒక ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్త ఒక సామాన్య మానవుని విలువ రూ. 5 కోట్లుగా ధర కట్టారు. ఉదాహరణకి, మనిషి ఏడాదిలో మూడుసార్లు, 70 సంవత్సరాల వయస్సులో 150సార్లు రక్తదానం ఇవ్వచ్చు. సరైన సమయంలో సరైన వ్యక్తికి ఇస్తే (దీన్నే Optimization Technique అంటారు.) 300 మి.లీ. రూ.2,000/- చొ॥న సుమారు రూ.3 లక్షలు వచ్చినట్లే!

**మార్పు :** "మన ప్రవర్తనతో, ప్రేమతో, వినయంతో అందరి మెప్పు పొందాలి. అదే సరైన పద్ధతి. ఒకరిని బాగుచేయాలన్న ధోరణి మాని, మిమ్మల్ని మీరు బాగు చేసుకోవడానికి ప్రయత్నించండి. అందర్నీ ఉద్ధరించేది బాబానే. మనల్ని ఉద్ధరించే బాబా వారినీ ఉద్ధరిస్తారన్న ఎఱుక ఉండాలి. దీన్ని గుర్తుపెట్టుకోండి. బాబా కృప మాత్రమే మీకు ఎప్పుడూ ఉంటుంది. నాకు మీలో మార్పు ముఖ్యం. మీలో మార్పు మీకు అక్కర్లేకపోయినా నాకు కావాలి" అంటారు శ్రీబాబూజీ.



నేత్రాలు సరైన టైమ్‌లో అమ్మితే రూ. 2 లక్షలు (చనిపోయాకే తీసుకుంటారు. కానీ డబ్బు ముందే ముట్టచెప్పే సంస్థలున్నాయి) వస్తాయి. కిడ్నీలు అమ్మితే సునాయాసంగా 10 లక్షలు వస్తాయి. జుట్టు అమ్మినా ఎంతో కొంత డబ్బులొస్తాయి. అలాగే ఇవాళ ఆరోగ్యంగా ఉంటే మందులకు ఖర్చు ఉండదు, హాస్పిటల్ చుట్టూ తిరగక్కర్లా, ఆటో డబ్బులు, మందుల డబ్బులు సేవ్ చేసినట్లే. దానికి కూడా విలువకట్టు. అంతేకాదు. నువ్వు హాస్పిటల్‌లో ఉంటే నీ మిత్రులు, చుట్టాలు, స్నేహితులు దూర దూర ప్రాంతాల్నుంచి ప్రయాణం చేసి వచ్చి, నాల్రోజులు టైం వేస్ట్ చేస్తారుగా, ఆ టైంకి కూడా విలువకట్టు. Time is Money అంటే అదే. అన్నింటికీ వడ్డీలతో సహా విలువకడితే సగటు మనిషి విలువ రూ.5 కోట్లు అని తేల్చారు. అయితే మరి ఇంత చదువుకున్న నీ విలువెంతో తెలుసుకో! 10 మంది జీవితాలని తీసుకెళ్తున్న ఆటోవాడి విలువెంతో తెలుసుకో! ఫ్రెంచ్ విమానం ఒకటి ఎట్లు సముద్రంలో పడిపోతే విమాన సంస్థ వారు మనిషికి ఒకరికి రూ. 10 కోట్లు సొమ్ము ఇచ్చారు. అంటే అర్థమేమిటి? అంతేకాదు, సిగరెట్ త్రాగుట, మందు కొట్టడం వంటి చెడ్డ అలవాట్లకి రేట్లు కట్టవచ్చు. రాత్రి నిద్రకు ముందు బ్రష్ చేయడం, పాకెట్ డిక్షనరీ ఎల్లవేళలా ప్రక్కన ఉంచుకోవడం ఒక్క మెతుకూ వదలకుండా భోజనం చెయ్యడం వంటి గొప్ప అలవాట్లకీ విలువ కట్టచ్చు. విలువ కట్టక పోవడమే మన దౌర్భాగ్యం. ***విలువ కట్టలేకపోతే విలువనివ్వనట్లే!***

## అందరూ బాగుండాలి

మేళ తాళాలు మ్రోగుతున్నాయి. పెళ్ళి సందడి మరీ సందడిగా ఉంది. ఆంధ్రాయూనివర్సిటీ వెంకటేశ్వరా ప్రేయర్ హాలు కుటుంబాలతో తరలి వచ్చిన అధ్యాపక వర్గంతో కళకళలాడుతోంది.

ఆ జరుగుతున్నది రమేష్ దత్తాగారి అమ్మాయి వివాహం. అందుకే అంత హడావిడి. ఆయన ఎందరికో ఆత్మీయుడు. మరెందరికో స్నేహితుడు. ముఖ్యంగా మాష్టరు ఇ.కె.గారి అంతేవాసులలో ఒకడు. ఈ వివాహానికి సంబంధించిన కథ అంతా మాష్టరు ఇ.కె.గారి చేతులమీదుగా నడిచిందే. అందుకే దత్తా దంపతుల కళ్ళు ఎందరు అక్కడ చేరినా, అందరిలో నుండి ఆయనకోసం వెతుక్కుంటున్నాయి.



**ప్రేమ :** ఎదుటి వ్యక్తి పట్ల నా ప్రేమ రెండు రకాలుగా ఉంటుంది. నాకు వారికి గల వ్యక్తిగత సంబంధం ఒకటి. రెండవది బాబాతో వారికున్న అనుబంధం. మొదటి దాని వలన వారికి నేను చేయవలసిందల్లా చేస్తుంటాను. రెండవది, బాబా స్మరణ వల్ల వారు నాకు దగ్గరవుతుంటారు.

కృప


**బాబా సన్నిధిలో గడపండి - బాబా స్మరణలో ఉండండి - బాబా చరిత్ర చదవండి.**

తెల్లటి బట్టలతో పువ్వులా మెరుస్తూ, చిరునవ్వులతో వెలుగును వెదజల్లుతూ, ప్రాంగణంలోనికి ప్రవేశించారు మాస్టరుగారు. ముహూర్తం సమీపించబోతూ ఉన్నది, వేదికను ఆరోహించారు మాష్టరుగారు. దగ్గరగా నిలబడి ముహూర్తాన్ని జరిపించి మొదటగా ఆశీర్వదించారు. "అందరూ నా వారే అందరూ బాగుండాలి" అన్నట్లుగా ప్రాంగణంలోని అందరినీ, ఒక్కసారిగా కలయజూచారాయన. ఆ చూపులు సోకినంత మేర ఇది, అది అని చెప్పలేని అనుభూతి ఏదో నిండిపోతున్నది. ఆ ప్రాంగణం ఆయన చూపులతో పొదగ బడుచున్నది. వేదికపై నుండి దిగుతున్న మాష్టరుగారి పాదాలకు నమస్కరించి, ఆయనను చేతులతో అందుకున్నారు యల్-యస్సార్ కృష్ణశాస్త్రిగారు. సూత్రధారణకు ఇంకా కొంత సమయమున్నది. మాస్టరుగారూ, కృష్ణశాస్త్రిగారూ అలా కొంత ప్రక్కగా, ఆ ప్రక్కగా ఉన్న చెట్లకు దగ్గరగా చేరారు. మరి కొంతమంది కూడా వారిని చేరుకున్నారు.

మాటల మధ్యలో ఒక ఆత్మీయుని గూర్చిన ప్రసక్తి వచ్చింది. కృష్ణశాస్త్రిగారే ఆ ప్రసక్తి తెచ్చింది. "అతని ఆలోచనా విధానంలో ఎక్కడో చెప్పలేని ఒక వెలితి కనబడుతోంది. అది ఏమిటంటారు?" అని అడిగారాయన. మాస్టరుగారు ఇలా అన్నారు ! రచనలో సూటిదనమున్నది. చెప్పడంలో స్పష్టత ఉన్నది. ఆలోచనా విధానంలో మరికొంత సమన్వయం అతడిలో రావలసియున్నది. నేనీ విషయం అతనితోనే చెప్పాను. చెప్పినప్పుడు ఓర్పుగా విన్నాడు. విన్నది నచ్చుడానికి, నచ్చింది దర్శనం ఇవ్వటానికి, దర్శనమిచ్చింది అతని జీవిత విధానంగా రూపొందటానికీ కొంత సమయం పడుతుంది. అక్కడ కొంత సమయం అంటే, ఒక్కొక్కప్పుడు కొన్ని జన్మలు పట్టవచ్చు. జనన, మరణాలు, జన్మల పరంపరలూ మన దృష్టిలో పెద్ద విశేషాలు కావచ్చు. కాని కాలానికవి అసలు విశేషాలేకావు. సహజమైన అంశాలు.

ఇంతకూ నేనతనికి చెప్పింది ఏమిటి? అంటే, "అబ్బాయీ! నీవు నాస్తికులను ద్వేషిస్తున్నావు అదేమంత మంచిపని కాదు. ఎందుకనంటే ఈ సృష్టిలో ఎవరి పరిణామం వారిది. పరిణామంలో ఎవరు ఎక్కడ ఉన్నారో, దానిని బట్టి వారి అభిరుచులూ, విశ్వాసాలూ ఉంటాయి. గొంగళి పురుగుల వల్ల తాత్కాలికంగా ఇబ్బంది ఉన్నమాట నిజమే. ఇబ్బంది ఉన్నది కదా అని వాటినన్నింటినీ చంపేస్తే, సీతాకోక చిలుకలు ఎక్కడినుండి వస్తాయ్? వాటిని చంపకూడదు, అసహ్యించుకోకూడదు. అలాగని వాటిబారిన పడకూడదు. వాటి మానాన వాటిని బ్రతకనిస్తే కాలక్రమాన అవే సీతాకోక చిలుకలై, మన

**దర్శనమహిమ** : సాకోరి మాతాజీకి (ఉపాసనీ మహరాజ్ ఆశ్రమాధికారి) శ్రీబాబూజీ ఎదురుగా కూర్చుని మాట్లాడుతున్నప్పడే దీర్ఘకాలంగా (బాల్యం నుండి) వేధిస్తున్న కడుపునొప్పి తగ్గిపోయిందని, అది కేవలం శ్రీబాబూజీ దర్శనమహిమ వలననే జరిగిందని, అందుకని మందు కూడా వాడలేదన్నారు. శ్రీసాయి దర్శన భాగ్యాన్ని కూడా ప్రసాదించారని అన్నారు. - **సాయిదీవెన.**



కనులకు విందుచేస్తాయి.

ఈ సృష్టి మన ఒక్కరిదే కాదు. ఈ సృష్టిలో ఉన్న వారందరిదీ. అందులో కొన్ని తెగలు మనకు నచ్చకపోవచ్చు. కొన్ని తెగలు మనని మెచ్చకపోవచ్చు. అంత మాత్రాన వారు నశించాలి అని మనకు అనిపించకూడదు. నశించాలి అని చెప్పి ఎవరు, ఎవరిని గూర్చి నినాదం చేసినా అది తప్పే అవుతుందిగాని, ఒప్పుకాదు. నశించాలి అని అనకూడదు. “అందరూ వసించాలి, అందరూ వర్ధిల్లాలి” అనాలి. మనలో ఒకరి సిద్ధాంతం మరొకరికి నచ్చకపోవచ్చు. కానీ ఈ సృష్టిలో అన్ని సిద్ధాంతాలకూ అవకాశం ఉన్నది. అన్ని సిద్ధాంతాలకూ ప్రాతినిధ్యం ఈ సృష్టిలో ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. నాస్తికత్వం, ఆస్తికత్వం ఈ సృష్టికి క్రొత్త కాదు. మొదటినుండీ ఒకదాని ప్రక్కన ఒకటి వస్తూ ఉన్నవే.

మహాభారతం చదివావా? మహాభారతం ఏ ఘట్టంతో ప్రారంభమవుతుంది? సర్పయాగాన్ని ఆపించడంతో ప్రారంభమవుతుంది. “సర్పాల వల్ల మాకు ద్రోహం జరిగింది. కనుక సర్ప కులం సమూలంగా నాశనమై పోవాలి” అని ప్రారంభిస్తారు. సర్పయాగాన్ని, కాని ఆ కోరిక నెరవేరలేదు. సర్పయాగం పూర్తికాలేదు. సర్ప కులం పూర్తిగా నశించిపోలేదు. ఆస్తికుడు వచ్చి కలుగచేసుకొని, జనమే జయుడికి నచ్చజెప్పి, సర్పయాగాన్ని ఆపించేసాడు. దీని అర్థమేమిటి? ఈ సృష్టిలో ఏజాతిగాని, ఏ ఆలోచనా విధానంగాని పూర్తిగా నశించి పోవటమనేది జరగదు. జరుగకూడదు. అందరూ ఉండాలి. అన్ని విధాలుగా ఆలోచించేవాళ్ళు ఉండాలి. ఎవరిని ఎవరూ ఇబ్బంది పెట్టుకోకుండా, ఎవరిని ఎవరూ కించపరచుకోకుండా, అందరూ ముందుకు సాగాలి. ఒకరినొకరు చిన్న చూపు చూడకూడదు. ఒకరినొకరు తక్కువగా అంచనా వేయకూడదు. ఎవరున్న స్థితిని బట్టి వాళ్ళు ఆలోచిస్తారు. అది తెలిసి మనం వాళ్ళను ప్రేమించాలి, గౌరవించాలి, ప్రోత్సహించాలి. చేతనయితే పరిణామంలో వారిని ముందుకు నడిపించాలి. అప్పుడు ఆపైన ఏం కనబడుతోందో వారే చెబుతారు. మనమెందుకు తొందరపడటం? మనమెందుకు తెగనాడటం? మనమెందుకు వారిని తూలనాడటం? **ఈ తెగనాడటాలూ, తూలనాడటాలూ దేనిని తెలియచేస్తున్నాయి? మనలో ప్రేమలేని తనాన్ని తెలియచేస్తున్నాయి.** మీరన్నారే ఇందాక **ఏదో వెలితి** కనిపిస్తూ ఉంటుందని. అది ఇదే. ఈ **ప్రేమ రాహిత్యమే!** ఈ అంశాన్నే అతనికి నొక్కి చెప్పాను.

ఇంకొక మాట కూడా చెప్పాను! సత్యానికి చాలా దూరంగా ఉన్నారని, ఆ నాస్తికులనబడే వారిని




**లీల :** జ్ఞాని (మహాత్ములు) విశ్వం అంతటా వ్యాపించిన చైతన్యంతో తాదాత్మ్యం చెంది ఉంటారు కాబట్టి ఆయన సంకల్పానుసారం జగత్తులో మార్పులు వచ్చి మీ బాధలు తీరతాయి, ప్రజలు వాటినే లీలలు (మిరకల్స్) అంటారు. లీలలంటే ఇంద్రజాల, మహేంద్రజాల విద్యలు కాదు. బాబా ఎప్పడూ అలా చేయలేదు. బాబా లీలలు ఎప్పడూ ప్రబోధాత్మకంగానే ఉండేవి. అవి సందర్భానికి అనుగుణంగా వ్యక్తమయ్యేవి. అవి చవిచూచిన ఆర్తునిలో పరివర్తన తీసుకువస్తుంది.

గురించి నీవు అంతగా చింతిస్తున్నావే! వారిని రెచ్చగొడుతూ, పందెం కాస్తూ, రచనలు చేస్తున్నావే, దానికన్నా సత్యాన్ని తెలుసుకోదలచిన వాళ్ళు ఎందరో ఉన్నారు. వారికి, సత్యాన్ని గూర్చి మృదుమధురంగా తెలియచెప్పడంలో నీ రచనా శక్తిని సద్వినియోగం చేయవచ్చు కదా! ఉన్ముఖులు కానివారిని చూసి గద్దించేకన్నా, ఉన్ముఖులై నిలబడుతున్న వారి యెడల బాధ్యత పడి నిలబడవచ్చుకదా! ఈ మాటలతనికి కొంత నచ్చినట్లున్నాయి. మరొకమాట కూడా చెప్పాను. దైవాన్ని గూర్చి ప్రస్తావన లేకుండా జీవించేస్తున్న వారి కన్నా, దైవాన్ని గూర్చి ప్రస్తావన తెస్తూ, అతడు లేడూ అతడు లేడూ అని ఒకటికి పదిసార్లు అంటున్నవాళ్ళు పరిణామంలో కొంతముందుకు వచ్చినట్లే కదా! లేడు, లేడు అనడంతో వారు తమ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. చాలా తీవ్రంగా ప్రారంభిస్తున్నారు. ప్రారంభించనివ్వండి. ఆ ప్రయాణం కొనసాగాలని కోరండి. కొనసాగి చేరవలసిన చోటుకు చేరితే ఉన్నాడు, ఉన్నాడు అని వాళ్ళు మనకన్నా పెద్ద గొంతులతో చాటుతారు. శుభమా! అని వాళ్ళు ప్రయాణాన్ని ప్రారంభిస్తుంటే మనం పనిగట్టుకొని తుమ్మడం ఏమైనా బాగున్నదా? దేవుని యొక్క ప్రస్తావన లేకుండా జీవించే వారికన్నా, దేవుని ఫొటోలు పెట్టుకొని, వాడికేదో రొటీన్‌గా ఇంత చేయి చూపించి, తమ మానాన తమకు తోచినట్లు బ్రతికేస్తున్న వారికన్నా, లేదా, తమకున్న చిన్న పెద్దా బాధ్యతలన్నీ తాము పూజించే దేవుడి నెత్తిన వేసి, మాదేమున్నది, మేం నిమిత్తమాత్రులం అని సోమరిపోతులుగా రూపొందుతున్నవారికన్నా, **జీవితంలో ఇంత కష్టం రాగానే మంత్రాన్ని, గురువుని ఇంకా చెప్పాలంటే తన మతాన్నీ మార్చేసుకుంటున్న వారికన్నా ఈ లేడు, లేడు అంటూ, అతడికొరకు నిజంగా వెతుకుతున్న వాళ్ళని మనం తక్కువచేసి మాట్లాడవచ్చునా?** ఇది ఆలోచించవలసిన అంశం కాదా? అని అన్నప్పుడు అతడు మరికొంత ఆలోచనలో పడినట్లు కనిపించాడు.

అప్పుడిలా చెప్పాను! తమ్ముడూ! సమాజం అన్న తర్వాత అన్నిస్థాయిల్లో ఉన్నవాళ్ళూ ఉంటారు. ప్రేమతో వారి స్థాయికి తగినట్లుగా, వారికి తగిన దోహదాన్ని అందించడమే మన కర్తవ్యం. అనాదిగా దేవుడి పేరిట పెద్దలందరూ చేస్తూ వస్తున్న పని అదే. ఉన్నస్థితి నుండి, ఉండవలసిన స్థితికి మానవజాతిని నడిపించడమే. ఆ నడిపించడానికి మన తెలివితేటల కన్నా, మన విమర్శనా జ్ఞానం కన్నా, మన వాదనా పటిమకన్నా, మనలోని ప్రేమే అందుకు పనికి వచ్చేది. ప్రేమ ముందు నడవాలి. ఆ ప్రేమకు

**మన విధాత బాబా :** మీ జాతకంగాని, కర్మలుగానీ, ఏమైనా సరే మీరు ఇక్కడకు రానంతవరకే. సద్గురువును ఆశ్రయించిన తరువాత ఇవేవీ పనిచేయవు. ఆయనను ఆశ్రయించగలగాలి. ఆయనను పట్టుకోగలగాలి. కాబట్టి ఈ ప్రారబ్ధం సంగతేం పట్టించుకోవద్దు. మన విధాత బాబా (సద్గురువు).



ఒదిగి, మనలోని శక్తియుక్తులన్నీ మెలగాలి. అప్పుడు అందరినీ అక్కున చేర్చుకోవడం చేతనవుతుంది. అందరినీ అర్థం చేసుకోవటమూ చేతనవుతుంది. అందరి ఎదుగుదలకూ దోహదం చేయటమూ చేతనవుతుంది" శాస్త్రీ ఇది నేను చెప్పిన చివరిమాట. ఇప్పటికి మీకు చెప్పే చివరిమాట కూడా ఇదే.

"అదిగో! సూత్రధారణ జరుగబోతున్నది. ఈ అక్షింతలు వేసి, ఈ సూత్రధారి ఇక మీ నుండి సెలవు తీసుకుంటాడు. ఇక వెళ్లిరానా మరి. ఈ కళ్యాణవేదిక మీ ప్రవేశంతో లోక కళ్యాణవేదికగా రూపొందింది. ఆత్మీయుని ప్రస్తావన వచ్చిన పుణ్యానికి విశ్వ కళ్యాణ సాధన ఎలాగన్నది? మా కన్నులు తెరిపించి చూపించారు. ఈ ***మా సామాన్య జీవితాల్లో మీరు ప్రవేశించినప్పుడల్లా ఒక విశేషం కనబడుతుంది. ఒక వివేకం వెలుగుతుంది. ఒక గమ్యం గోచరిస్తుంది. ఒక ప్రయాణం ప్రారంభమవుతుంది. గురూజీ! ఇవే మా నమస్కృతులు అందుకోండి.*** మళ్ళీ మనం ఎప్పుడు కలుసుకుంటామో?

అదేమిటామాట? మన కలయికకు కొనసాగడమే కాని, ఎడబాటు ఉండదు. కలయిక అనేది మానసికమైనది, ఇంకా చెప్పాలి అంటే ఆత్మపరమైనది. ఆ కలయికకు శ్రీకారం చుట్టడానికి, అప్పుడప్పుడూ కావలసిన దోహదాన్ని తగుమాత్రంగా అందించడానికి ఈ దేహాలు నిమిత్తమాత్రంగా అవసరమవుతూ ఉంటాయి. నిజానికి ఈ మన ప్రయాణం ఎప్పటినుండి సాగుతూ ఉన్నదో? ఆ సాగుతున్న ప్రయాణంలో మధ్యలోని విశేషాలివన్నీ. అందరూ ఉండండి. అందరికీ శుభం అవుతుంది. ఇక నాకు అనుమతి ఇప్పించండి. మాష్టరుగారు సూత్రధారణ అనంతరం నూతన దంపతులను మరొక్కసారి ఆశీర్వదించి, ఆ వేదికపై నుంచి నిత్య నూతనమైన తన చిరునవ్వులను వెదజల్లుతూ ప్రాంగణాన్ని మొత్తంగా మరొక్కసారి కలియచూసారు. కొద్దిక్షణాల్లో చిన్న చిన్న అడుగులను చకాచకా వేస్తూ అలా అందిరిలోనుండి ముందుకు సాగుతున్నారు. కర్తవ్యోన్ముఖులై ముందుకు సాగుతున్నారు.

**సాయి సమగ్రదర్శిని : www.saibaba.com   సద్గురు తత్త్వ దర్శిని : www.gurukrupa.info**
**గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన** mail ID : **gurukrupa@saimail.com**




**ఆనంద స్వరూపుడు :** బాబా మనలోనే ఆనంద స్వరూపంగా ఉన్నాను అన్నారు కదా! కానీ ఆ స్వరూపాన్ని దర్శించకుండా, మనలో ఏం అడ్డమొస్తున్నాయి? మన ఆలోచనలు, మన మనస్సు, రకరకాల టెన్షన్స్, మన కోరికలు ఇవన్నీ అడ్డుకుంటున్నాయి. ఆనంద స్వరూపాన్ని చూడలేకపోతున్నాము. ఆ అడ్డాలు మబ్బులలాగా ఉన్నాయి. ఆ మనసులోని మబ్బుల చాటు నుండి అప్పడప్పడు ఒక ఫ్రాక్షన్ ఆఫ్ సెకెండ్ దర్శనమిచ్చి, మనలను మురిపించి, మరలా మాయమవుతుంటుంది బాబా మోము.

(విషయంపై), దానిపట్ల నీకున్న దృక్పథం (నీ తీరు), ఆ విషయం పట్ల నీ వ్యవహార సరళి అదే నీకు ఆనందాన్నిస్తుంది.



ఈ సత్సంగాలు మొదలైనవి నీదైన నీ జీవితాన్ని నేర్పుతో ఆనందమయం చేసుకోవాలో నీవు నేర్చుకునేలా నీకు నేర్పడానికే ఉన్నాయి.

మనమంతా సాయిభక్తులం. ఆ గుర్తింపులోనే ఆనందాన్ని ఆస్వాదిద్దాం.

నీవెంత సంతోషాన్ని, నిశ్చింతను పొందుతున్నావన్నదే నీ గమ్యంవైపు ఎంత ముందుకు ప్రయాణిస్తున్నావు అన్న దానికి గుర్తు.

మనకు బాబా ఉన్నారు. ఇంక దుఃఖానికి తావేది? కలత చెందడానికేమున్నది? జీవితాన్ని సంతోషంగా అనుభవిద్దాం, ఆస్వాదిద్దాం. బాబా అనే ఆనందంలో పొంగిపోండి. ఆ ఆనందాన్ని నేను చూడాలి. ఆ సంతోషం చూస్తే నేనూ సంతోష పడతాను.



హ్యాపీగా ఉండండి, ఆనందంగా ఉండండి. నవ్వుతూ ఉండండి. తుళ్ళుతూ ఉండండి. బాబా ఇంత ఇచ్చినా ఆనందంగా ఉండండి. అంత తీసుకొని ఇంకా కావాలంటే అడుగుతూ ఉండండి. ఆనందంగా అడగండి. ఎన్నైనా అడగండి. ఎంతసేపైనా అడగండి. ఎన్నిరోజులైనా అడగండి. ఆనందంగా అడగండి. ఏడుస్తూ అడగకండి. అప్పుడు ఆనంద జీవనం సాయిపథం. అడిగింది ఇవ్వడం ఆయన శపథం. అడగటం నేర్పడం సాయిపథం. రెండూ సమన్వయపడతాయి అప్పుడు. అడుగుతూ ఉంటాం, హ్యాపీగా అడుగుతుంటాం. అడిగింది ఇస్తుంటాడు. తినేస్తుంటాం. హ్యాపీగా ఉంటాం. మళ్ళీ అడుగుతూ ఉంటాం.

బాబా యొక్క పథం **Happiness through Happiness.**



నడిచే మార్గమూ ఆనందమే. పొందేదీ ఆనందమే. గమ్యమూ ఆనందమే. ఎప్పుడో వచ్చేటువంటి ఆనందం వస్తుందో లేదో నాకు తెలియదు. ఇప్పుడు మాత్రం నాకు ఆనందం కావాలి. అందరూ హ్యాపీగా ఉండండి. మీరెంత హ్యాపీగా ఉంటే నేనంత హ్యాపీగా ఉంటాను. సరేనా!

– శ్రీబాబూజీ

గురోర్ మూర్తిం - స్మరే నిత్యం.... గురోర్ నామం - సదా జపేత్...
గురోర్ వాక్యం -ప్రకుర్వీత... గురోరనన్యభావయేత్

గురోర్ మూర్తిం - స్మరే నిత్యం.... గురోర్ నామం - సదా జపేత్...
గురోర్ వాక్యం -ప్రకుర్వీత... గురోరనన్యభావయేత్

స్వభక్తేచ్ఛయా మానుషం దర్శయంతమ్
నమామీశ్వరం సద్గురుమ్ సాయినాథమ్



మార్పు మీకు అవసరం లేకపోయినా! నాకవసరం
అంటూ మార్చే అభ్యుదయంగా, సాంప్రదాయంగా
మలస్తున్న అవిశ్రాంత సంస్కృత సన్నిధానమే - శ్రీబాబూజీ సాన్నిధ్యం